తారలకు తండ్రి

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఆగష్టు 23, 2015

హోల్ సెల్



..పూర్తి స్వేచ్ఛనిచ్చారు

బాలీవుడ్...టాలీవుడ్...ఏ వుడ్ అయినా టాబూకు ఒకటే. నటనకు భాషా పట్టింపులు లేవని నిరూపించిన తార. 'మేచిస్, చాందినీ బార్, హైదర్, అస్తిత్వ, బీవీ నెం 1, ఫనా, లైఫ్ ఆఫ్ పై, ది నేమ్ సేక్, నిన్నే పెళ్లాడతా, దృశ్యం...' ఇలా ఏ చిత్రం చూసినా ...ప్రతి ఒక్క సినిమాలోనూ భిన్నమైన పాత్ర. విభిన్నమైన నటన. తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు. అందుకేనేమో రెండు సార్లు జాతీయ ఉత్తమనటి అవార్డులు వరించాయి. ప్రతిష్టాత్మక పద్మశ్రీ సైతం అందుకుంది. తన సినిమాలు, పాటలు, కవితల గురించి ఆమె మాటల్లోనే.

....

తొలిరోజుల్లో దేవానంద్‌తో...

నేను దేవానంద్ సాబ్‌తో కలిసి పనిచేసినప్పుడు చాలా చిన్నదాన్ని. 'హమ్ నౌజవాన్' చిత్రంలో ఆయన కుమార్తెగా చేశాను. ఇప్పుడు ఓసారి పాత రోజుల్లోకి వెళితే... ఆయనలో ఆత్మ విశ్వాసం ఎంత నిండుగా వుండేదో గుర్తొస్తుంది. ఏదైనా సరే ఆస్వాదిస్తూ చెయ్యమని ఎప్పడూ చెప్తుండేవారు. పైగా ఆయన నిత్యం ఏదో ఒక పనిలో మునిగిపోయేవారు. అందుకేనేమో అంత హుషారుగా వుండేవారు. ఆయన నుంచి ఎంతో విలువైన పాఠాలు నేర్చుకున్నా. అందుకే దేవానంద్ సాబ్ అంటే నాకెప్పుడూ గౌరవభావమే.

పాట..పద్యం...

'హైదర్' కోసం పాడాను. అప్పటి నుంచి సాధన చేస్తూనే వున్నాను. ప్రతిరోజూ కనీసం గంటసేపైనా పాడతుంటాను. పద్యాలు రాస్తుంటాను. గుల్జార్ సాబ్ కూడా రాయమని ప్రోత్సహిస్తుంటారు.

సుదీర్ఘ పయనం

'బాజార్' చిత్రంతో మొదలైంది నా నట ప్రయాణం. సుదీర్ఘ పయనంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. నటనా రంగంలో వున్న ప్రతి ఒక్కరి మాదిరిగానే నాకూ ఎత్తు పల్లాలు, జయాపజయాలు వున్నాయి. గుల్జార్ సాబ్ కానీ, విశాల్ భరద్వాజ్ కానీ నా పాత్రల్లో నాకు నచ్చినట్టు ఇమిడిపోవడానికి పూర్తి స్వేచ్ఛనిచ్చారు. దాంతో నా వ్యక్తిత్వం తెర మీద కనిపించేది. అయితే ఆ సినిమా చేస్తే నాకు అవార్డు వస్తుందా రాదా అని ఆలోచించి మాత్రం ఆలోచించను. ఆ పాత్రకు నేను పూర్తిస్థాయిలో న్యాయం చేయగలనా లేదా అని మాత్రమే చూస్తాను. ప్రేక్షకులకు వినోదం అందించగలుగుతున్నందుకు చాలా సంతోషంగా వుంది.

బాలీవుడ్ - టాలీవుడ్

నేను రెండు చిత్రరంగాల్లోనూ పనిచేశాను. ప్రతి ఒక్కరూ వారి శక్తిమేరకు మంచి చిత్రాలు తీయడానికి ప్రయత్నిస్తారు. కథలో ఆయా ప్రాంతాల సంస్కృతి ప్రధాన పాత్ర పోషిస్తుంది. ప్రజల జీవితాల్లో సినిమా కీలకం. కథ, చిత్రీకరణ ప్రేక్షకులకు నచ్చిందంటే విజయం సాధించినట్టే.

●

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

గాలిలో మేడలు

పైసా ఖర్చు లేకుండా...చెమటోడ్చకుండా...మేడలు కట్టేసే నేర్పరులున్నారు. అంత నైపుణ్యం వారికి ఎలా అబ్బిందో.. ఎక్కడ నేర్చారో.. ఎవరు నేర్పారో మరి. అబ్బబ్బ... అవి మామూలు మేడలా. వాటికి మట్టి, ఇటుక, సిమెంటు, కాంక్రీటు, కూలీలు, ఇంజినీర్లు అవసరంలే. ఊహ ఒక్కటి చాలు. అవే... గాలిలో మేడలు.

అనుకుంటాం కానీ... వీటిని కట్టడం అందరి వల్లా కాదు... అందుకు భీకరమైన నేర్పు, భూదేవంత ఓర్పు కావాలి. మరి ఏమాత్రం కష్టపడకపోవడం నేర్పే కదా. అలా గంటల తరబడి కుర్చీల్లో కూలబడి ఎంత సేపైనా కలల్లో తేలిపోవాలంటే ఓర్పు కావొద్దూ.

గాలిలో మేడలు కట్టేవాళ్లు ఇప్పుడే కాదు. పూర్వం నుంచీ వున్నారు. 'బాపడు-పేల పిండి' కథానాయకుడు సరిగ్గా అలాంటి వాడే... అనేకంటే ఆద్యుడు అనుకోవచ్చు. అతగాడి వారసులే ఇవాళ మేఘాల్లో మల్టీప్లెక్స్‌లు నిర్మించుకుంటూ ముందుకు పోతున్నారు. ఎవరెన్నన్నా, ఏమన్నా పెద్దగా పట్టింపులేం వుండవు. ఛీ అన్నా ఛా అన్నా దున్నపోతు మీద వాన చందమే. ఎవరెలా పోయినా, ఎన్ని ఇక్కట్ల పాలైనా డోంట్ కేర్. గాలిలో మేడలు కట్టుకుంటూ బతికేస్తుంటారు. చేతికి అందిన పది రూపాయలను పది లక్షలు చేసినట్టు ఊహా ప్రపంచంలో తేలిపోతుంటారు. ఈ లోగా గట్టిగా ఏ గాలో వీచడం అందుకోలేనంత దూరానికి ఆ పది రూపాయల నోటు కొట్టుకుపోవడం జరిగిపోతుంది. ఈ ప్రహసనం అంతటిలోనూ కాల హరణం మినహా మరోటి కానరాదు.

వీరికంటే పది ఆకులు ఎక్కువ చదివారు పాలకులు. వీరు ఎన్నికల ముందు గాలిలో మేడలు కట్టడంలో చెప్పలేనంత బిజీగా వుంటారు. ఎన్నికలయ్యాకే నేల మీద గుడిసెలు చూయిస్తారు. అబ్బో.. రాష్ట్రాన్ని సింగపూర్‌లా చేస్తాం. మలేషియాలా చేస్తాం అంటూ పూటకో దేశం పేరు చెప్పారు. ఏడాదిన్నర కాలం గడిచిపోయింది. అప్పుడెక్కడ వున్నామో ఇప్పుడూ అక్కడే వున్నాం. అణుమాత్రం మార్పు రాలా మన జీవితాల్లో. ఆ తర్వాత మరో వెంచర్ ప్రారంభించారు. రాష్ట్ర రాజధానిని అలా చేస్తాం ఇలా చేస్తాం అంటున్నారు. గత అనుభవ జ్ఞానంతో ఏమీ చెయ్యరని అనుకోవచ్చేమో.



◆ మనలో మాట

ప్రత్యేక రాష్ట్ర హోదా ఇస్తామంటూ గిరగిరా గాలిలో తిప్పేశారు ప్రధానులవారు. అలా చెప్పే నాయుడుగారు సైతం ఓట్లు గుద్దించుకున్నారు. రైతులకు, మహిళలకు, యువతకు బోలెడన్ని గాలి మేడలు కట్టి చూపించారు ఇప్పుడు చూడండి ఇద్దరూ కలిసి జనాన్ని నేలకేసి కొట్టినంత పని చేశారు.

సోదర రాష్ట్ర సీఎం గారూ తక్కువ కాదు. ఎన్నేసి మేడలు కట్టారు మీటింగుల్లో. ఇళ్లన్నారు. ఉద్యోగాలన్నారు. రుణ మాఫీలన్నారు. ఏవేవో ఉదారంగా చెప్పేశారు. అవన్నీ ఎప్పుడెప్పుడు జరుగుతాయా అని పాపం జనం ఎదురుచూస్తూ వున్నారు.

వీరూ వారనేముంది! గద్దెనెక్కిన నేతలు చెప్పినవన్నీ గాలిలో మేడలేనని అర్థమైన రోజు వుంటుందీ! కడుపు కాలి... వళ్లు మండి...గుండె రగిలిన జనం గాలిలో మేడలు కట్టేవారికి ఊపిరాడకుండా చేయరూ.

■

టపా

శభాష్ చమన్ సింగ్

విష సర్పాలను చూస్తే మనిషికి ప్రాణం పోయినంత పనౌతుంది. అలాంటిది చమన్ సింగ్‌కు పాములంటే ఇష్టం. అపాయంలో ఉన్న సర్పాలను కాపాడుతు వాటి మీద ఉండే ప్రేమను వ్యక్తం చేస్తున్నాడు. వన్య ప్రాణాలను సంరక్షించుకోవడం మన బాధ్యత. వింత లోకంలో ఆస్టిన్‌లో అలామో డ్రాఫ్ట్‌హౌజ్ వారు ప్రదర్శించే సినిమా ప్రేక్షకుడిని గగుర్పాటుకు గురిచేయడం గురించి చదివి ఆశ్చర్యపోయాం.

శ్రీను, గాజువాక

కాఫీ కెరీర్

కాఫీ ఎగుమతుల్లో భారత్‌ది ప్రత్యేక స్థానం. కాఫీ టేస్టర్ కోర్సును కెరీర్‌గా ఎంచుకోని ఉన్నత శిఖరాలను అందుకోవడం అభినందించదగ్గ విషయం. సాయంత్ర వేళల్లో ఓ కప్పు కాఫీ తాగిన అనుభూతిని కలిగించారు.

అమర్, అనంతపురం.

చక్కటి కథ

మనిషి తనకు తగిలిన గాయాలతో మానసికంగా, శరీరకంగాను క్షోభకు గురి అవుతాడు. అలాంటి పరిస్థితుల్లో మనిషి తన గతాన్ని మరిచిపోవడం జరుగుతుంది. అలాంటి మనిషి మీద జాలి చూపించాల్సిన ఈ సమాజం వారిని చులకనగా చూస్తుంది. మానవత్వం మరిచిని ఈ సమాజానికి ఒక చక్కని కథని అందించారు.

విశ్వం, రాజంపేట.

మార్గదర్శి

కష్టపడి పని చేసి దాచుకున్న ప్రతి రూపాయికి ఎంతో విలువ ఉంటుంది. అలాంటింది భద్రంగా బ్యాంకులో డబ్బు దాచుకుంటే ఆ డబ్బును బ్యాంకు స్వాహ చేస్తే సామాన్యుడి పరిస్థితి ఏంటి? ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొన రాజేశ్ సక్రే గురించి చదివి అతన్ని మనసులోనే అభినందించకుండా వుండలేకపోయాం. ఈ వారం వింత లోకం చాలా బాగుంది. కేరళకే కంటి వైద్యుడిగా పేరు తెచ్చుకున్న టోనీ ఫెర్నాండెజ్ కొత్తగా వైద్యవృత్తిని చేపట్టినవారికి మార్గదర్శిగా నిలుస్తాడు.

రాజు, విజయవాడ.

మరిన్ని కథలు

జపాన్‌లో ఆత్మహత్యలు చాలా ఎక్కువ అని గుర్తుంది. అయితే వారి మానసిక పరిస్థితి, కుటుంబ సమస్యతో చనిపోయే వారిని షిగెహాస్ కాపాడాటం బాగుంది. అలాగే వారికి రక్షణ తగు రక్షణకు కల్పిస్తున్నారు. ఇలాంటి వ్యాసాలు మరిన్ని ఇస్తే బాగుంటుంది. సాటి మనిషి ఆపదలో ఉంటే ఆదుకోకపోవటం అటుంచి వారిపై కామెంట్స్ చేయడం వంటివి చేస్తున్నారు. మనిషి తన విలువను, సాటికి మనిషికి సాయపడాలి అనే సుగుణాల్ని మరిచి ప్రవర్తిస్తున్నారని అని తెలిసే వ్యాసం బాగుంది. మనిషి విలువలను తెలిపే మరిన్ని కథలు ఇస్తారని ఆశిస్తున్నాను.

రాము, కడప

మార్కెటింగ్ ట్రిక్స్

నేడు ఏ పత్రిక చూసినా ఏ టీవీ చానల్ చూసినా యాడ్స్ ప్రధానమైనవి. మనిషిని ఎంత ప్రభావం చూపుతాయో మనలో మాటలో చక్కగా వివరించారు.కేరళకే అతడు కంటిపాప అయ్యాడు. ఈలాంటి వ్యక్తుల గురించి తెలుసుకోవడం బాగుంది. మన డాక్టర్లు అతడిని మార్గదర్శకం తీసుకోవాలని ఆశిస్తున్నాను.

క్రిష్ణ, తిరుపతి

ఈ సంచికలో....

హాలోల్ 'సెల్'

కవర్ స్టోరీ — 14

అద్భుతాలు అనామకంగా పుడతాయి. ఎవ్వరికీ తెలీవు. మౌనంగానే పెరుగుతాయి. ఎవ్వరూ గ్రహించరు. నిశ్శబ్దంగా విస్తరిస్తాయి. ఎవ్వరూ పట్టించుకోరు. ఎప్పుడో వెనక్కి తిరిగి చూస్తే గానీ తెలీదు. అవి అనామక అద్భుతాలు గానే ఆరంభమయ్యాయని అప్పుడు అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తారు. సరిగ్గా ఇటువంటి అద్భుతమే రెండు దశాబ్దాల క్రితం జులై మాసపు చివరి రోజున మన దేశంలో చోటు చేసుకుంది. మామూలుగానే అప్పుడు అది విప్లవం అవుతుందని ఎవ్వరూ ఊహించలేదు. అది దినదినాభివృద్ధి చెందుతుంటే మామూలే అనుకుని ఆ ప్రవాహంలో కలిసిపోయి దానినీ మనలో కలిపేసుకున్నాం.

స్ఫూర్తి 3
ప్లాస్టిక్ మ్యాన్ కల

నవ్వుల్ పువ్వుల్ 4

యువ 5
తొమ్మిదేళ్లకు మాస్టారు!

సినిమా కబుర్లు 6
తారలకు తండ్రి

వింత లోకం 8
ఎ ఫిల్మ్స్ బై...

ప్రత్యేకం 9
యు ఆర్ పర్‌ఫెక్ట్

తెలుసా 10

కెరటం 11
వైకల్యం ఓడిన వేళ...

కథ 18
కలలో సుల్తానా

రుచి 21
ఆహా ఆమ్లెట్

బాలనేస్తాలు 22
బంగారమా? దూదా?

కొత్త పుస్తకాలు 24
సురవరం ప్రతాపరెడ్డి రచనలు

మట్టి కింద పట్టణం -12

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

స్ఫూర్తి

ప్లాస్టిక్ మ్యాన్ కల

ప్లాస్టిక్ కాలుష్య విరుగుడుకి రోడ్డు వేశాడు ఆర్ వాసుదేవన్. ప్లాస్టిక్‌ను తొక్కి దారి వేయొచ్చని చెప్పాడు. అదో విప్లవాత్మకమైన ప్రయోగం. ఇక రోడ్లన్నీ ప్లాస్టిక్‌వే అనే ప్రచారం. 'ప్లాస్టిక్ మ్యాన్' కృషి తర్వాత భారత్‌లో ఏమైంది? మొక్కుబడిగా ప్రభుత్వాలు కొన్ని రోడ్లు పరిచాక మాయమైంది. కానీ, ఇవే ప్లాస్టిక్ రోడ్లపై డచ్ గురిపెట్టింది. నెదర్లాండ్స్‌లో భారీ ప్రాజెక్టులకు కృషి జరుగుతోంది.

ఆర్.వాసుదేవన్ మధురైకి చెందిన కెమిస్ట్రీ ప్రొఫెసర్. తన విద్యార్థి బృందంతో కలిసి ఓ విప్లవాత్మకమైన పద్ధతిని రూపొందించారు. పర్యావరణానికి శాపంలా మారిన ప్లాస్టిక్‌తో రహదార్లు వేసేందుకు ఓ ఫార్ములా కనిపెట్టారు. విదేశాల్లో ప్లాస్టిక్ మ్యాన్‌గా మన్ననలు అందుకున్నారు. తన ఆవిష్కరణ భారత్‌ను ప్లాస్టిక్ కాలుష్య కోరల నుంచి కాపాడుతుందని కలలు కన్నారు. వాసుదేవన్ ఈ ప్రయోగానికి పూనుకోవడానికి కారణం మధురైలో రోజురోజుకూ పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు. ఎన్ని నిషేధాలు అమలైనా ఏదో ఓ రూపంలో ప్లాస్టిక్ తిష్టవేస్తోంది. లక్షల ఏళ్లు గడిచినా డీ కంపోజ్ కానీ ఈ వ్యర్థం మురుగు సమస్యకు, అనారోగ్యాలకు కారణమవుతోంది. ఈ పరిస్థితి దేశమంతటా ఉంది. ఈ ప్లాస్టిక్ భూతం బారి నుంచి బయట పడేసే ఆవిష్కరణ ఏదైనా చేయాలని ఆయన సంకల్పించి సాధించాడు. కోట్ల రూపాయలు ఇస్తామని విదేశీ కార్పొరేట్లు ముందుకొచ్చినా వాటిని కాదనుకుని దేశ సేవకే ఉచితంగా తన జ్ఞానాన్ని అందించాడు. రీసైకిలింగ్‌కు కూడా పనికిరాని ప్లాస్టిక్‌ను కూడా ఆయన పద్ధతిలో రోడ్ల తయారీకి వాడొచ్చు. ప్లాస్టిక్ మిశ్రమాన్ని ఉపయోగించడమే ఈ పద్ధతిలోని ప్రత్యేకత. ఇప్పుడున్న రోడ్డు వేసే విధానాలు యంత్రాల్లో భారీ మార్పులేమి చేయకుండానే ఈ పద్ధతికి అన్వయించుకోవచ్చు. లేదా లెగో బ్రిక్స్‌లా ప్లాస్టిక్, మెటల్‌లా మిశ్రమంతో పెద్ద ప్లాస్టిక్ బ్రిక్స్‌ను తయారుచేసి రోడ్డును పేర్చేయొచ్చు. వీటిని ఊడదీయడం, అతికించడం చాలా తేలిక. చాలా వేగవంతంగా రోడ్డు వేసేయొచ్చు. మరమ్మతుల కోసం ట్రాఫిక్‌ను ఆపేయాల్సిన అవసరమూ లేదు. ఏ భాగం దెబ్బతిన్నదో ఆ భాగాన్నే ఊడబెరికి అక్కడ మరో బ్రిక్‌ను పేరిస్తే సరిపోతుంది. డొల్లగా ఉన్న ఈ ఇటుకల్లో చాలా తేలిగ్గా విద్యుత్, సమాచార ఇతరత్రా కేబుళ్లను ఏర్పాటు చేసుకోవచ్చు. తారు రోడ్డు కన్నా తక్కువ ఖర్చుతో రహదారులను వేయొచ్చు. బిటుమెన్ రోడ్లు కన్నా అధిక ఉష్ణోగ్రతల్ని, పీడనాల్ని ఇవి తట్టుకుంటాయి. తక్కువ ఉష్ణోగ్రతల వద్ద కూడా ఇవి దృఢంగా ఉంటాయి. గుంతలు పడే అవకాశం తక్కువ. వాటర్ ప్రూఫ్ కూడా. నీటి వల్ల దెబ్బతినే అవకాశం అస్సలు ఉండదు. తేలిగ్గా ఉండే ఈ బ్రిక్స్‌ను ఒక చోట నుంచి మరో చోటకు సులువుగా తరలించవచ్చు. పనిచోట వీటిని తయారుచేయాల్సిన అవసరం ఉండదు. తారు రోడ్ల కన్నా మూడు కాలాల పాటు ఇవి మన్నుతాయి. ఒక్కో మోనోబ్లాక్ 300 టన్నుల బరువును మోయగలవు. దాదాపు 50 ఏళ్ల పాటు మన్నుతాయి.

రోడ్డు బిగి..

కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు లెక్కల ప్రకారం రోజుకు 15 వేల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పోగవుతున్నాయి. వీటిని రోడ్లకు వాడితే చాలా వరకు కాలుష్యాన్ని తగ్గించినట్టే. తొలుత వాసుదేవన్ విధానానికి మంచి స్పందన కనిపించింది. పేటెంట్ ఉన్నా ప్రజల కోసం ఉచితంగా సాంకేతికతను అందిస్తానని ఆయన చెప్పారు. ప్రభుత్వాలు ముందుకొచ్చాయి. కేరళ, తమిళనాడు, ఉత్తరాఖండ్, జార్ఖండ్ లాంటి సుమారు 11 రాష్ట్రాల్లో 5 వేల కిలోమీటర్ల రోడ్ల వరకు నిర్మాణమయ్యాయి. టాటా స్టీల్‌కు చెందిన జంషెడ్‌పూర్ యుటిలిటీ అండ్ సర్వీస్ కంపెనీ 12-15 కిలోమీటర్ల రోడ్లను వేసింది. 22 రోడ్లను విస్తరించింది. నైజీరియా ప్రభుత్వం కూడా తమ దేశంలో ఈ విధానంలో రోడ్లు వేసేందుకు సహాయం కోరింది. ఇదంతా 2002ల నాటి పరిస్థితి. కానీ ఆ తర్వాత ఎందుకో ప్లాస్టిక్ రోడ్ల నిర్మాణం స్థానికంగా చప్పుడు చేయడంలేదు. కానీ ఇదే సాంకేతికతను నెదర్లాండ్స్ వినియోగించుకోబోతోంది. ప్లాస్టిక్ మిశ్రమ బ్రిక్స్‌తో ఓ భారీ రోడ్డు ప్రాజెక్టును చేపట్టింది. ఈ విధానాన్ని భవన నిర్మాణాల్లోను వాడుకోవచ్చని చెబుతున్న వాసుదేవన్ భారత్‌లో ఈ సాంకేతికతతో రోడ్లు వేసేందుకు ఏ ప్రభుత్వం ముందుకు వచ్చినా ఉచితంగా సహాయం చేసేందుకు సిద్ధమని చెప్పారు. డీ కంపోజ్ అవని ప్లాస్టిక్ ఏ రకంగా వదిలించుకోవాలా అని తలలు పట్టుకున్న విదేశీయులకు సరికొత్తగా ప్లాస్టిక్‌ను వాడే టెక్నిక్ అందించి ప్రశంసలు పొందాడు. కానీ ఇక్కడ ఆయన కృషిని సద్వినియోగం చేసుకునే ఉద్దేశం కనిపించడంలేదు. ఈ మధ్య గోవా 'టెడ్ ఎక్స్'లో ప్రసంగం ఇచ్చేందుకు వెళ్లిన ఆయన అక్కడ కూడా ఆ ప్లాస్టిక్ రోడ్ల వల్ల కలిగే ప్రయోజనాల్ని వివరించాడు. స్థానిక ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విన్నవించాడు. ఇదీ ఇక్కడ శాస్త్రవేత్త పరిస్థితి. అద్భుత ఆవిష్కారానికి ప్రాణం పోయడమే కాక దాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వాలతో పోరాడాల్సి వస్తోంది. ✦



నవ్వుల్ – పువ్వుల్

అన్యాయం

"ఇది మరీ అన్యాయం. రేపట్నుంచి నేను స్కూలుకు వెళ్లనుగాక వెళ్లను" అన్నాడు ఆరేళ్ళ ప్రమోద్.

"అంత అన్యాయం ఏం జరిగిందిరా?" నవ్వుతూ అడిగాడు తండ్రి.

"లేకపోతే మా టీచరేమో పుస్తకం చూస్తూ పాఠం చెబుతుంది. మమ్మల్ని మాత్రం చూడకుండా పాఠం అప్పజెప్పమంటుంది" అందుకే స్కూలుకెళ్లను.

అవునా?



రవి: నాన్నా ... కుందేలుకు ఎన్ని కాళ్లుంటాయి?

తండ్రి: నాలుగు

రవి:కాదు, మూడే.

తండ్రి: కాదు. నాలుగు.

రవి: కాదంటే కాదు, మూడే, మూడు

తండ్రి: నిజమే నాయనా, నీలాంటి వాళ్లను బట్టే తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అనే సామెత వచ్చింది.

నష్టం

డాక్టరు: మీరు సిగరెట్టు మానేయాలండీ..!

వ్యక్తి: ఏం, ఎందుకని,ఏమన్నా నష్టం జరుగుతుందా నాకు?

డాక్టరు: మీక్కాదు... నాకే...మీరు నా సోఫా అంటిస్తున్నారు.



హాబీ

మారుతీ రావు తన కొత్త కారులో ఝుమ్మని హైవేలో దూసుకెళ్తున్నాడు. తన పక్కనున్న వెహికల్ కూడా అంతే వేగంతో వెళ్తుంది. అయితే అక్కడ అతి వేగం నిషేధం. రూల్స్ పట్టించుకోకుండా ఇద్దరూ వెళ్తున్నారు. ఒక చోట ట్రాఫిక్ పోలీస్ మారుతీ రావు కారు ఆపి వేగంగా వెళ్తున్నందుకు ఫైన్ కట్టమన్నాడు.

మారుతీ రావు: నేను వేగంగా వెళ్తున్న మాట నిజమే గానీ ఇంత మంది వెళ్తున్నారు కదా. నా దగ్గర మాత్రమే మీరు ఫైన్ వసూలు చేయడం ఏం బాలేదు.

ట్రాఫిక్ పోలీస్: నువ్వెప్పుడైనా చేపలు పట్టావా?

మారుతీ రావు: హా. అది నా హాబీ... అయితే...!

ట్రాఫిక్ పోలీస్: మరి చెరువులో చేపలన్నీ పట్టం కదా

మారుతీ రావు: ఆ.........!!

పరుగు పందెం

జర్నలిస్టు: ప్రతి మగాడి విజయం వెనక ఓ స్త్రీ ఉంటుందని అంటుంటారు. మీరు పరుగు పందెంలో ఫస్ట్ రావడం వెనక ఎవరైనా ఉన్నారా?

క్రీడాకారుడు: లేకేమిటండి.. కాకపోతే స్త్రీ కాదు. పురుషుడు వున్నాడు. నాకు అప్పు ఇచ్చిన షావుకారు వున్నాడు. నేను పరుగు తీస్తున్నప్పుడు ఆయన తరుముతున్నట్లు ఫీలవుతానంతే!

పితృప్రేమ



(సుందరం పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేశాడు)

సుందరం: సార్ మీరు వెంటనే రావాలి. రెండు గంటల నుండి మా నాన్న, ఎదురింటి అప్పారావు పోట్లాడుకుంటున్నారు. (రొప్పుతూ చెప్పాడు)

పోలీస్: రెండు గంటల నుండా? పక్క వీధిలో పోలీస్ స్టేషన్ పెట్టుకుని ఇప్పుడా రావడం (కోపంగా అడిగాడు).

సుందరం: మొదట మా నాన్న అప్పారావుని చితకబాదుతుంటే చూస్తూ ఉండిపోయానండి.

పోలీస్: మరి ఇప్పుడు

సుందరం: అప్పారావు మా నాన్నని చితక బాదుతుంటే చూడలేక పరిగెత్తుకొచ్చేనండి.

తొమ్మిదేళ్లకే మాస్టారు!

తొమ్మిదేళ్ల విద్యార్థికి హోం వర్కు పెద్ద తంటానే. బడి పాఠాలు బుర్రకు ఎక్కించేందుకు పుస్తకాలతో కుస్తీలు మామూలే. కానీ, అదే ఐదో తరగతి విద్యార్థి మాస్టారుగా మారి తోటి పిల్లలకు పాఠాలు చెప్పేశాడు. బడి నుంచి వచ్చాక తన ఇంటి పెరటి బడి తెరిచేసి బుల్లి ప్రిన్సిపాల్‌గా మారాడు.

పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ పేదల ప్రాంతం. తోళ్ల ఉత్పత్తుల పనులు, చేపలు పట్టేవారు, కాయ కష్టంతో రోజులు వెళ్లదీసే నిరుపేదలకు చిరునామా. చిన్న బుడతడు కూడా రూపాయో పాపాయో సంపాదిస్తే గానీ కుటుంబం ముద్ద దిగదు. అంత పేద ప్రాంతంలో చదువు అనేది ఓ లగ్జరీ. ఆ విలాసాన్ని అందుకోగలిగాడు బాబర్ అలీ. తండ్రిది నార ఉత్పత్తి పని కావడంతో బడికి పంపగలిగాడు. అలాగని శ్రీమంతుడు కాదులెండి. ఓ ఇరుకైన ఇల్లే వారి నివాసం. కానీ బాబర్ తండ్రికి చదువు విలువ బాగా తెలుసు. ఆ లక్షణం అబ్బింది బాబర్‌కు కూడా. తను ఎంచక్కా పాఠశాలకు వెళు తుంటే తోటి స్నేహితులు పనులకు పోతూ కనిపించేవారు. అప్పుడు బాబర్‌కు తొమ్మిదేళ్లు. అంత చిన్న వయసులోను ఓ ప్రశ్న రోజు వేసుకునేవాడు. వీళ్లంతా తనతో పాటు ఎందుకు బడికి రావడంలేదని. మిత్రులను, వారి తల్లిదండ్రులను, చివరకు తన ఇంటి వారిని అడిగాడు ఆ ప్రశ్న. సమాధానం ఫీజులు కట్టలేక, అంతదూరం ప్రయాణ చార్జీలు లేక, అందుబాటులో బడులు లేక. ఆ సమాధానం అతణ్ని నిద్ర పట్టనివ్వలేదు. వారి సమస్యకు పరిష్కారం ఏమిటని ఆలోచిస్తున్న బాబర్‌కు ఓ ఐడియా తట్టింది. తాను వెళ్లినా, మిత్రులు వెళ్లినా బడిలో అవే పాఠాలు చెబుతారు. మరి అవే పాఠాలు అయినపుడు తానెందుకు మిత్రులకు చెప్పకూడదు. ఈ ఆలోచనను మిత్రులకు చెప్పి తన బడి అవ్వగానే ఇంటి వెనుక జామ చెట్టు కింద చేరుకుందామని, బడిలో తనకు చెప్పిన పాఠాల్ని వారికి నేర్పుతానని అన్నాడు. తొలుత ఎవరూ శ్రద్ధ పెట్టకపోవడంతో ఏవో చిన్న చిన్న ఆటలు ఆడదామని వారికి చెప్పి అక్కడ చేర్చాడు. కాసేపు డ్యాన్సులు, అరుపులు, ఆటలు అయ్యాక అక్షరాలు దిద్దించడం మొదలెట్టాడు. హాయిగా ఆడుకోనిస్తుంటే పలక బలపం పట్టడం అంత కష్టంగా తోచలేదు మిత్రులకు.

అలా ఇంటి పెరట్లో బాబర్ బడి మొదలైంది. తాను రోజు నేర్చుకునే విషయాల్ని మిత్రులకు నేర్పుతూ 5వ తరగతి పూర్తిచేశాడు. ఆరో తరగతి మొదలెట్టే లోగా చాలామంది మిత్రులు, వారి తోటి వాళ్లు పోగయ్యారు. ఈ విషయం తెలుసుకున్న బడి మాస్టర్ విరిగిన సుద్ద ముక్కల బదులు పెద్ద పెట్టెను అందించాడు. ఇంకొందరు పెద్దలు బ్లాక్ బోర్డును కొనిచ్చారు. తన పాకెట్ మనీతో చాక్లెట్లు, బిస్కెట్లు తెచ్చి రోజు హాజరయ్యేవారికి ఇచ్చేవాడు. అలా చిన్న పిల్లలను ఆకట్టుకునేవాడు. తన ఇంటి నుంచి బడి 10 కిలోమీటర్ల దూరంలో ఉండేది. రోజు ఉదయాన్నే అక్కడకు చేరుకోవడం సాయంత్రానికి పరుగున ఇంటికి రావడం. వెంటనే అక్కడ తన మిత్రులకు పాఠాలు మొదలెట్టడం ఇదే 11 ఏళ్లుగా బాబర్ దిన చర్య. ఏనాడు రెండు బడులకు సెలవు పెట్టింది లేదు. ఓ పక్క తోటివారికి చదువు చెబుతూనే డిగ్రీ పూర్తిచేసిన బాబర్ ఎంఏ చేస్తున్నాడు. ఇప్పుడా పాఠశాలలో 300 మంది చదువుతున్నారు. ఆరుగురు ఉపాధ్యాయులు న్నారు. వారు కూడా ఆ స్కూల్లో చదివిన వారే. మరో పదిమంది వలంటీర్లు పనిచేస్తున్నారు. విద్యార్థుల్లో బాలబాలికలు సమానంగా ఉంటారు. రామకృష్ణ మిషన్‌తో పాటు మరికొన్ని సంస్థలు, వ్యక్తులు పాఠ్యపుస్తకాలు, పెన్నులు వగైరా సామాను సమకూర్చుతున్నారు. ప్రభుత్వం కూడా ఈ బడిని గుర్తించి 8వ తరగతి వరకు సర్టిఫికెట్లను అందిస్తోంది. ఆ ప్రాంత అధికారులు బాబర్ కృషిని గౌరవిస్తూ సాయపడుతున్నారు. తాను తొమ్మిదేళ్లపుడు చేసిన ఆలోచన ఇంత పెద్ద విజయం అవుతుందని బాబర్‌కు అప్పుడు తెలీదు. తన శక్తిని తెలుసుకున్నాక ఇప్పుడో కల కంటున్నాడు. 'డ్రీమ్ స్కూల్' పేరిట సకల సదుపాయాలతో పేద విద్యార్థులకు ఓ ఉన్నత పాఠశాల నెట్‌వర్క్ ఏర్పాటు చేయాలని బాబర్ తపన. ప్రపంచంలోనే అతి చిన్న ప్రధానోపాధ్యాయుడిగా పిలుస్తున్న బాబర్ ఆ కలనూ నిజం చేసుకునేందుకు శ్రమిస్తున్నాడు. ✦

తారలకు తండ్రి

ఒక మంచి అన్న
ఒక మంచి మిత్రుడు
ఒక మంచి స్వామిభక్త పరాయణుడు
అన్నింటికి మించి నాలుగు తరాల నటీమణులకు ఒక మంచి తండ్రి. తెలుగు సినీ పరిశ్రమలో ఆది నుంచి అజాత శత్రువుగా ఎదిగిన ఓ గొప్ప కళా స్రష్ట!



ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా కొల్లూరు మండలం రావికంపాడులో జూలై 9 వ తేదీన జన్మించాడు గుమ్మడి వెంకటేశ్వరరావు. కొల్లూరు జిల్లా పరిషత్ హైస్కూలులో చదువుతుండగా గుమ్మడి గొంతు బావుంటుందని ఆయన క్లాసు టీచరు రాఘవయ్య మాస్టారు, సాయంత్రం సమావేశాల్లో కావ్య పఠనం చేయించేవాడు. గుమ్మడి కావ్య పఠనం చేస్తుంటే మృదు మధురంగా సుస్పష్టంగా వుండేది. అందుకే ఏ విషయాన్నైనా ప్రకటించాలంటే, ప్రార్థన చేయించాలంటే, ఇన్స్‌పెక్షన్ కోసం ఎవరైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు వచ్చినప్పుడు గుమ్మడి చేత ప్రోగ్రెస్ రిపోర్టు చదివించేవారు. ఈ విషయం స్వయంగా గుమ్మడి చెప్పారు.

తొలి రోజుల్లో ఎన్టీఆర్ స్ఫూర్తి

చెన్నై ఎల్లామ్స్ రోడ్‌లో ఓ చిన్న గదిలో ఎన్టీఆర్, టీవీరాజు, గుమ్మడి అద్దెకుండేవారు. వీళ్ళంతా నెల నెలా ఇంటి నుండి ముప్పై రూపాయలు మని ఆర్డర్ తెప్పించుకొనేవారు. గుమ్మడి, టీవీ రాజు డబ్బులు నెలాఖరులోగా అయిపోయేవి. ఎన్టీఆర్ మాత్రం ఓ పది రూపాయలు మిగుల్చుకునేవాడు. ఇదెలా సాధ్యం? అని ఎన్టీఆర్‌ని అడిగితే "బ్రదర్ మనం మన తల్లిదండ్రులు మీద ఆధారపడుతున్నాం. వాళ్లు ఎంత కష్టపడి ఈ డబ్బులు పంపిస్తున్నారో మనం అర్థం చేసుకోవాలి. మనల్ని మనం కంట్రోల్ చేసుకోగలగాలి. తక్కువలో సరిపెట్టుకోవడం అలవాటు చేసుకోవాలి" అని చెప్పారు. అదే మాట చివరి వరకూ పాటించాడు. గుమ్మడి వాళ్ళ మధ్య స్నేహ బంధం చివరి వరకూ కొనసాగింది. ఎన్టీఆర్ స్ఫూర్తితోనే తన జీవన పయనం సాగిందని చాలా సభల్లో చెప్పేవారు గుమ్మడి.

సినీ రంగ ప్రవేశం

తొలి సారి ఎన్టీఆర్ సినిమాలోనే చేయాల్సింది."పిచ్చి పుల్లయ్య" నిర్మాణం లేటయ్యే సరికి "అదృష్ట దీపుడు" తొలి సినిమా అయ్యింది. తర్వాత రెండు చిత్రాలు ఎన్టీఆర్ బ్యానర్‌లోనే నటించాడు. "పిచ్చి పుల్లయ్య, తోడు దొంగలు", ఆ తర్వాత కన్యాశుల్కం అర్ధాంగి. మళ్లీ ఎన్టీఆర్ బ్యానరు సినిమా 'జయ సింహ' తర్వాత 'మిస్సమ్మ' 'రాణి రత్నప్రభ', 'చిరంజీవులు' ఇలా వరుస విజయాల సినిమాల్లో నటించే సరికి గుమ్మడి అగ్రనటుల మధ్య ఓ మంచి నటుడిగా తనను తాను తీర్చిదిద్దుకున్నాడు. తర్వాత

ఎస్వీఆర్‌తో.....

సూర్యకాంతంతో...

జమునతో...

గుమ్మడి తన నట జీవితంలో వెనక్కి తిరిగి చూసుకోలేదు.

మైలురాళ్ళు

అక్కినేనితో 'ఇలవేలుపు, సువర్ణ సుందరి మాయబజార్, దొంగల్లో దొర', ఎన్టీఆర్‌తో 'సారంగధర, వినాయక చవితి, వీర కంకణం' ఇలా తొలి రోజుల్లో అగ్రనటుల విజయంలో తనూ పాలు పంచుకున్నాడు. "ఇంటిగుట్టు, ఇల్లరికం, జయభేరి, నమ్మిన బంటు , రాజ మకుటం, పెళ్ళి సందడి, శభాష్ రాముడు, పెళ్ళి కానుక, రేణుకా దేవి మహత్యం, శాంతి నివాసం, శ్రీవెంకటేశ్వర మహత్యం, భార్యాభర్తలు, ఇద్దరు మిత్రులు, పాండవ వనవాసం, శ్రీ సీతారామ కళ్యాణం, వాగ్దానం, ఆరాధన, భీష్మ, కానిస్టేబుల్ కూతురు, కులగోత్రాలు, మహామంత్రి తిమ్మరుసు, సిరిసింపదలు, చదువుకున్న అమ్మాయిలు, ఇరుగు పొరుగు, లక్షాధికారి, మూగమనసులు, పునర్జన్మ, శ్రీకృష్ణార్జున యుద్ధం, డాక్టర్ చక్రవర్తి, మంచి మనిషి, మురళీ కృష్ణ, పూజాఫలం, వెలుగు నీడలు, ఆత్మ గౌరవం, అంతస్తులు, కీలుబొమ్మలు, నాదీ ఆడజన్మే! ప్రేమించి చూడు, ఆస్తిపరులు, కన్నె మనుసులు, నవరాత్రి, పల్నాటి యుద్ధం, ప్రాణ మిత్రులు, ప్రైవేట్ మాస్టారు, బంగారు గాజులు, అదృష్టవంతులు, ఆదర్శ కుటుంబం, ఆత్మీయులు, బుద్ధిమంతుడు, మనుషులు మారాలి, పూలరంగడు, భార్యాబిడ్డలు, దసరా బుల్లోడు, ప్రేమనగర్, సంపూర్ణ రామాయణం, లేత మనుసులు, విచిత్ర బంధం, జీవన తరంగాలు, భూమి కోసం, అల్లూరి సీతారామరాజు, సోగ్గాడు, జమిందారుగారి అమ్మాయి, దానవీరశూరకర్ణ, కురుక్షేత్రం, సర్దార్ పాపారాయుడు, ప్రేమాభిషేకం, అనురాగ దేవత, స్వయం వరం ఈ చిత్రాలన్నీ వంద రోజులు ప్రదర్శితమైనవే. ముఖ్యంగా గుమ్మడికి మంచి పేరు తెచ్చినవే.

విలన్‌గా అసమాన నటన

నిజానికి గుమ్మడి ముఖ కవళికలు మోసపూరితమైన పాత్రలకు, కుట్రపూరితమైన పాత్రలకు సరిపోవు. ఎంత సేపు సాత్వికాభినయం పాత్రల్లో రాణించగలడు. మొట్టమొదట "లక్షాధికారి" చిత్రంలో తన పాత్రను సవాలుగా తీసుకొని వెండితెర మీద తన అద్భుతమైన నటన ప్రదర్శించి కలకాలం గుర్తుండిపోయాడు. 'పూలరంగడు' చిత్రంలో కూడా పాలిష్డ్ విలన్‌గా నటించి ఆ పాత్రకి ప్రాణం పోశాడు. "ఇద్దరు మిత్రులు" చిత్రంలో అజయ్ (అక్కినేని) మామ పాత్రలో దివాన్‌గా నటించి అద్భుతమైన పేరు తెచ్చుకున్నాడు. 'లోగుట్టు పెరుమాళ్ళుకెరుక' చిత్రంలో భయంకరమైన విలనీ ప్రదర్శించాడు. కొన్ని సినిమాల్లో విశ్వామిత్రుడు, భృగు మహర్షి, దుర్వాసుడు లాంటి పాత్రలు పోషించాడు గాని అవి కోపిష్టి పాత్రలుగా నిలిచిపోయాయి. గుమ్మడిది సుతిమెత్తని మనసు. తను నటించిన సన్నివేశాల్ని తెర మీద చూసినా చలించిపోయి కంట తడి పెట్టేవాడు. అలాగే వివాదాల జోలికి వెళ్ళేవాడు కాదు. ఎప్పుడు ఒకే మాట అంటుండేవాడు 'మా తెలుగు సినీ పరిశ్రమలో ఉన్నవారందరం ఒక కుటుంబం. మా కుటుంబంలో ఎవరికి పేరు ప్రతిష్టలు వచ్చినా అందులో అందరికీ భాగం వుంటుంది. ఎన్టీఆర్ ,ఎ.ఎన్.ఆర్ లు నాయకులుగా క్రమశిక్షణతో ఆదర్శవంతంగా ముందు నడవడమే గాకుండా మమ్మల్ని నడిపించారు. బహుశా అందు కేనేమో మా కాలంలోని చిత్రాలను స్వర్ణయుగపు సౌరభాలుగా చెప్పుకుంటారు' అనేవారు.

అక్కినేని,జగ్గయ్యతో...

అరుదైన పురస్కారాలు

మొట్ట మొదటిసారిగా ఎన్టీఆర్ బ్యానరులో నటించిన 'తోడు దొంగలు' చిత్రానికి రాష్ట్రపతి పురస్కారం గెలుచుకున్నాడు. తర్వాత కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో వచ్చిన 'మహామంత్రి తిమ్మరుసు' చిత్రంలో తిమ్మరుసు పాత్ర న భూతో నా భవిష్యతి అన్న రీతిలో ప్రదర్శించబడింది. ఈ చిత్రం రాష్ట్రపతి పురస్కారంతో బాటు దక్షిణ భారత చలన చిత్ర పరిశ్రమ తరపున తాష్కెంట్ ఫిలిం ఫెస్టివల్‌లో పాల్గొంది. 1978లో 'నమ్మిన బంటు' చిత్రానికి గాను రష్యాలో అక్కినేని, సావిత్రి, గుమ్మడికి ప్రశంసల వర్షం కురిపించారు. రెండు సార్లు నంది అవార్డులతో బాటు 1977లో పద్మశ్రీ పురస్కారాన్ని పొందగలిగాడు.

గుమ్మడికి అరుదైన గౌరవం

గుమ్మడి ఏ రోజూ సన్మానాలు, సత్కారాల కోసం వెంపర్లాడలేదు. ఆయన నటనా ప్రతిభకి అరుదైన గౌరవాలు వరించాయి. 3 సార్లు జాతీయ అవార్డు కమిటీలో గౌరవ సభ్యులుగా వున్నారు. 28,33,38 వ జాతీయ అవార్డుల కమిటీలో చోటు దక్కించుకున్నారు. ఈ సమయంలో నిష్టగా నిజాయితీతో తన సేవలందించారు."మేఘ సందేశం" చిత్రంలో మాత్రం జయసుధకి జాతీయ బహుమతి తృటిలో తప్పిపోయినందుకు చాలా బాధపడ్డారు. అదే విధంగా రెండు సార్లు నంది అవార్డు కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఏది ఏమైనా తనకు అప్పగించిన పనిని చిత్త శుద్ధితో చేశారు. ఫలితం, ప్రతిఫలం తన జీవితంలో ఏ

రోజూ ఆశించి ఎరుగరు.అందుకే గుమ్మడి తన అరుదైన వ్యక్తిత్వంతో కొనవూపిరి ఉన్నంతకాలం తన స్థాయిని, స్థానాన్ని కాపాడుకున్నారు. మాయాబజార్, మా ఇంటి మహాలక్ష్మి, కులదైవం, కులగోత్రాలు, జ్యోతి, నెలవంక, మరో మలుపు, ఏకలవ్య, గాజుబొమ్మలు, పెళ్ళి పుస్తకం, చివరి చిత్రమైన శ్రీ కాశినాయన జీవిత చరిత్రతో ఆయన సుదీర్ఘ ప్రయాణం ముగిసింది.

గుమ్మడిలాంటి నటులు లేరు!

వయసులో అగ్రనటులిద్దరికంటే చిన్నవాడు. కాంతారావు, జగ్గయ్య కూడా కొన్ని మాసాలు పెద్ద వారే అంటారు. ఎన్టీఆర్‌కి గుమ్మడికి రూపురేఖల్లో దగ్గరి పోలికలున్నాయి. అందుకే ఎన్టీఆర్ మొదట్నించి ప్రధాన పాత్రలకు గుమ్మడినే ఎంపిక చేసేవారు. అక్కినేని, గుమ్మడి మధ్య మంచి అవగాహన కుదిరింది. పైగా సావిత్రి కాంబినేషన్ లో వీరు నటించిన చిత్రాలు సూపర్ హిట్ అయ్యాయి. అక్కినేనికి తండ్రిగా సావిత్రికి తండ్రిగా, అన్నగా చాలా సినిమాల్లో నటించాడు. విశ్వామిత్రుడు , దశరథుడు, భృగువు, జమదగ్ని, గౌతముడు, బలరాముడు, కర్ణుడు లాంటి పాత్రల్లో ఎదురులేని నటుడిగా నిలిచాడు. గుమ్మడిలో మరో గొప్ప సుగుణం ఏమిటంటే ఏదైనా సినిమా చూస్తే ఎంత చిన్న నటుడు నటించినా ప్రత్యేకించి అభినందించేవాడు. అలాగే సెట్‌లో చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా ఎందరో కొత్త హీరోలకు సహకరించి వారి కెరీర్ గ్రాఫ్ పెరగడానికి సహకరించాడు. అయిదు వందల సినిమాల్లో అవలీలగా నటించిన ప్రతిభ ఆయనది. ఆయనకి పక్షవాతం రావడంతో గొంతు సమస్య వచ్చింది. తను ప్రాణపదంగా ఇష్టపడే గొంతు అపశ్రుతులు పలికే సరికి నటన విరమించాడు. రఘుపతి వెంకయ్య అవార్డుతో బాటు చివరి రోజుల్లో తను నటించిన 'మాయాబజార్' చిత్రాన్ని రంగుల్లో చూసి చలించిపోయారు. ఆనందంతో ఆ సినిమాలో నటించిన వారిలో అప్పటికి అక్కినేని తనే మిగిలివున్నారు. జనవరి 26వ తేదీ 2010 న ఆయన మరణించారు.

ఇమంది రామారావు

9010133844

'చిక్కుడు' సాయం

'కెప్టెన్ బీనీ'గా పాపులరైన బార్రీ కిర్క్‌కు ఉడకపెట్టిన చిక్కుడు గింజలంటే ఇష్టం. కేవలం రుచిని ఆస్వాదించడానికే కాక సేవా కార్యక్రమాలకు వాటినే వాడుతున్నాడు ఆయన. 1986లో 100 గంటల పాటు గింజలున్న స్నానపు టబ్బులో గడిపి ప్రపంచ రికార్డు సాధించాడు. అప్పుడు అందిన విరాళాల్ని వివిధ సేవా సంస్థలకు విరాళమందించాడు. ఈ ఏడాదే కిర్క్‌కు 60 ఏళ్లు నిండాయి. ఈ సందర్భంగా మొత్తం 60 గింజలను తన గుండుపై పచ్చబొట్టు వేయించుకున్నాడు. అరవైమంది గింజకు 4,500 రూపాయల చొప్పున స్పాన్సర్ చేశారు. అందుకు వారి సంక్షిప్త నామాలను గింజ మధ్యలో పొడిపించుకున్నాడు. అలా అందిన సుమారు రెండున్నర లక్షల రూపాయల్ని సెరిబ్రల్ పాల్సీ అనే వ్యాధితో బాధపడుతున్న మూడేళ్ల చిన్నారి వైద్యం కోసం ఖర్చుచేశాడు. ఆ చిన్నారి కుటుంబ సభ్యుల్లో ఒకరిగా కిర్క్‌ను ఆదరిస్తున్నారు.

ఎ ఫిల్మ్ బై..

డయానా కిమ్ అనే డాక్యుమెంటరీ ఫొటోగ్రాఫర్‌కు ఎదురైన పరిస్థితిని డాక్యుమెంటరీ ఫిల్మ్‌గా తీయొచ్చు. తాను ఊహించని ఘటనతో ఆమె హతాశురాలయ్యింది. ఫొటోగ్రఫీపై ఆమె మక్కువ పెంచుకునేందుకు ఆమె తండ్రే కారణం. మాయి ద్వీపంలో పెరిగిన ఆమె తల్లిదండ్రులు విడాకులు తీసుకున్నారు. తన తండ్రితో అప్పుడు దూరమైన కిమ్ తల్లితో కలసి స్నేహితులు, బంధువుల ఇళ్లలో పెద్దైయింది. తండ్రి గురించిన ఏ సమాచారం లేకపోవడంతో చాలా బాధపడేది. ఆ బాధను డాక్యుమెంటరీ చిత్రాలు తీయడం ద్వారా దూరంపెట్టేది. 2003లో గూడు లేని వారిపై దీర్ఘకాలిక డాక్యుమెంటరీ ప్రాజెక్టును ప్రారంభించింది. 2012లో ఆమె హొనలూలులో ప్రాజెక్టుకు కావాల్సిన ఫుటేజ్‌ను తీస్తుండగా ఒక మతి స్థిమితం లేని వ్యక్తి ఎదురయ్యాడు. ఆయన్ను ఎక్కడో చూసినట్టుందే అనుకున్న కిమ్ తేరిపార చూసేసరికి షాక్‌కు గురైంది. ఆయన ఎవరో కాదు! తన తండ్రే. బక్కచిక్కిపోయి, ఒళ్లంతా మట్టి కొట్టుకుపోయి, జుత్తు అంతా గట్టిబడి చాలా దయనీయమైన స్థితిలో కనిపించాడు. వెంటనే కిమ్ తన తండ్రిని తీసుకుపోయి శుభ్రం చేయించి మంచి బట్టలు వేయించింది. అయినా తండ్రి గుర్తుపట్టకపోవడంతో వైద్య చికిత్స చేయించగా స్కీజోఫ్రినియాతో బాధపడుతున్నట్టు తేలింది. కిమ్ చెప్పినా వినకుండా ఇల్లు వదలి వెళ్లిపోయాడు. ఆ రోజు నుంచి రోజు కలిసి జాగ్రత్తగా చూసుకుంటుండగా 2014లో గుండెనొప్పి వచ్చింది. వైద్యం చేయించి ఇంట్లోనే ఎటూ కదలకుండా ఉంచింది. కోలుకున్నాక కిమ్‌ను గుర్తుపట్టడంతో ఊపిరి పీల్చుకున్న ఆమె తన తండ్రి మామూలు మనిషి కావాలని తనకిచ్చిన పాత కెమెరాను బహూకరించింది. కిమ్ ప్రయత్నాలు ఫలించి ఇప్పుడిప్పుడే ఆయన మతిమరుపు నుంచి బయటపడుతున్నాడు. తాను ఓ ఉద్యోగం చూసుకుని కిమ్‌కు ఆసరా అవుతానని ఆయన చెబుతున్నాడు.

మంచి విందు

టర్కీలోని కిలీస్ పట్టణానికి చెందిన ఓ కొత్త జంట తమ వివాహ వేడుకను ఆదర్శవంతంగా చేసుకుంది. సిరియా నుంచి వలస వచ్చిన ఆశ్రితులకు పెళ్లి విందు ఇచ్చి అన్నార్తుల ఆకలి చల్లార్చారు. ఫెతుల్లా యుజుమ్‌కువోగ్లు, ఎస్రా పోలాట్‌ల పెళ్లి సందర్భంగా సుమారు 4000 వంది సిరియా వలసదారులకు విందు ఇచ్చారు. వధూవరులిద్దరూ స్వయంగా భోజనాన్ని వడ్డించారు. ఫెతుల్లా తండ్రి అలీ కిమ్సె యోక్ మూ (కిమ్) అనే స్వచ్ఛంద సంస్థలో వలంటీర్‌గా పనిచేస్తున్నారు. ఆ సంస్థ సిరియా నిరాశ్రయులకు అన్నదానం చేస్తోంది. టర్కీలో మూడు రోజుల పాటు జరిగే వివాహాలకు భారీగా ఖర్చుచేస్తారు. అంత ఖర్చు సంస్థకే ఉపయోగిస్తే బాగుంటుందని కొడుకు కోడళ్లకు ఆయన చెప్పడంతో వారు సరేనన్నారు. ఒక రోజు డబ్బు వారే పెట్టుకోవడమే కాక పెళ్లి దుస్తుల్లోనే కార్యక్రమం దగ్గరకు వచ్చి వడ్డించారు. ఇంతకన్నా సంతోషంగా వివాహం చేసుకోలేమని, మరిచిపోలేని అనుభూతి కలిగిందని వారు చెప్పారు. విందుకు హాజరైన నిరాశ్రయులు ఆనందంతో తమను దీవిస్తుంటే ఉద్విగ్నతకు లోనయ్యారు నూతన దంపతులు.

యు ఆర్ పర్‌ఫెక్ట్

చేతిలో 'యూ ఆర్ పర్‌ఫెక్ట్' ప్లకార్డుతో గంటలపాటు నిలబడి పరుగుల పెట్టే మెట్రో మనుషుల మనసును నెమ్మదిస్తున్నాడు ఓ కుర్రాడు. లోపాలు ఎంచే సూటిపోటుల బదులు మీరు పర్‌ఫెక్ట్ అంటూ మనసు తడుముతున్నాడు. లోపాలను పక్కనబెట్టి వారిని వారు ప్రేమించుకునేలా ప్రేరణనిస్తున్న తరుణ్ గిద్వానీ గురించే ఇప్పుడు నెట్టింట మాట్లాడుకుంటోంది కాస్మోపాలిటన్ యువత. అతడి సైన్‌బోర్డును తామూ చూసి రిలీఫ్ పొందామని ట్వీట్లు ఇస్తున్నారు, పోస్ట్‌లు చేస్తున్నారు కొందరు. గిద్వానీని వెతికి మరీ పట్టుకుని గొప్ప సాయం చేశావని కంటతడి పెట్టుకుంటున్నారు మరికొందరు.

మీరు నల్లగా ఉన్నారా? మీరు పొట్టిగా ఉన్నారా? మీ టింగ్లీష్‌తో ఫ్రెండ్స్‌లో నవ్వుల పాలవుతున్నారా? 'నీ డ్రస్సు చీప్‌గా ఉంది.. నీ నవ్వు రోతగా ఉంది.. నీ మాట చిరాకు పెడుతోంది. మా అంత స్టేచర్ కాదులే.. మా అంత డబ్బు లేదులే.. నా అంత పెద్ద జాబ్ కాదు.. నా అంత సర్కిల్ లేదు.. భర్తకు విడాకులిచ్చావా! నువ్వు మామూలుదానివి కాదు, అమ్మాయి నో చెప్పిందా! నువ్వు బతకడం వేస్టు..' ఎలా అనిపిస్తున్నాయి ఈ మాటలన్నీ.

విపరీతమైన నెగటివ్ ఎనర్జీతో చంపేస్తున్నాయి కదా. మనం లెక్కచేయని, మనలో కనిపించని లోపాల్నీ అంటగడుతున్నాయి కదా. ఇవన్నీ నిత్యం మనకు వినిపించేవే. మన లోపాల్ని వెక్కిరించేవే. మన ఇన్‌సెక్యూరిటీని బిజినెస్ చేసుకునేవే. పొద్దున్న లేచింది మొదలు సూటిపోటి మాటలు, వెన్ను వెనుక పోటులు మామూలే. సొంతోళ్లూ వెక్కిరింతలతో మనసును గాయపరుస్తుంటారు. ఈ మాటలతో అలసిపోయే హృదయానికి 'యూ ఆర్ బ్యూటీఫుల్ (నువ్వు అందమైనదానివి), 'యూ ఆర్ పర్‌ఫెక్ట్' (నువ్వు లోపం లేని వాడివి) అనే మాటలు ఎదురుపడితే ఎంత సంతోషంగా ఉంటుంది. మనసు ఎంత నెమ్మది అవుతుంది. పరుష మాటల దెబ్బలకు మందు వేస్తాయా పలకరింపులు. అలసిపోయిన మనసుకు సాంత్వనిస్తాయి ఆ ఊసులు. మనసు తలపులకు తలుపు తెరవకుండా పరుగులు పెడుతున్న మెట్రో జీవాలను ఈ మాటలతోనే మౌనంగా పలకరిస్తున్నాడు తరుణ్ గిద్వానీ.

పాజిటివ్‌గా ఒక్క మాట

పాజిటివ్ మాటలను ప్లకార్డుపై రాసి మార్కెట్‌లోనో, వీధి మూలో, బస్‌స్టాప్‌లోనో, పార్కు ఎదురుగానో కనిపిస్తాడు. బలంగా ఆ మాటల్ని మనసులో ముద్రిస్తాడు. 17 ఏళ్లకే అసలు తానెంటో తెలుసుకునేందుకు అంతా వెతకడం మొదలెట్టాడు తరుణ్ గిద్వానీ. తాను పర్‌ఫెక్ట్ కాకుండా చేస్తున్న తన లోపాలేమిటో శోధించడమే పనిపెట్టుకున్నాడు. అంతా పరిశీలించాక 8 నెలలకు సమాధానం దొరికింది. తానే కాదు అందరూ పర్‌ఫెక్టే అని బోధపడింది. పాతికేళ్లకే తత్వసారాన్ని పట్టేసి 'యూ ఆర్ పర్‌ఫెక్ట్' అంటూ పలకరించడం మొదలెట్టాడు. ఖలీల్ గిబ్రాన్ రచనలంటే గిద్వానీకి ప్రాణం. తాత్విక ఆలోచనల చుట్టూనే తిరిగే ఆ రచనలే అతణ్ని ఫిలాసఫీ వైపు పరుగు పెట్టించాయి. ఓ న్యాయసంస్థలో కంటెంట్ రైటర్‌గా పని చేస్తూ ఊరూరా మారుతున్న గిద్వానీది హైదరాబాద్. పూణె, ముంబై, కోల్‌కతా, బెంగళూరు ఇలా తాను వెళ్లిన చోటల్లా ఈ ప్లకార్డ్‌లను ప్రదర్శిస్తున్నాడు. కాలిఫోర్నియాకు చెందిన మిత్రుడు బెంజమిన్‌తో కలిసి తొలుత హైదరాబాద్‌లో సైన్‌బోర్డులతో తిరిగాడు. ఆఫీస్ పని ముగియగానే సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నగరంలోని జనసమ్మర్ద ప్రదేశాల్లో ఒకదాన్ని ఎంచుకుని ప్లకార్డు పట్టుకుని కదలకుండా నిలబడిపోతాడు. వారాంతాల్లో ఏడెసి గంటలపాటు సైన్‌బోర్డుతో కాలక్షేపం చేస్తాడు. మూడేళ్లుగా ఇలాగే అందర్నీ ఆకట్టుకుంటున్నాడు. ఇలా ఎందుకు చేస్తున్నావని ఎవరైనా ప్రశ్నిస్తే.. నవ్వి మీ కోసమే అని చెబుతాడు. వీడు పిచ్చోడిలా ఉన్నాడని ఆటపట్టిస్తుంటారు, నువ్వు మరీ మంచోడిలా మా గాళ్ ఫ్రెండ్స్ ముందు నటిస్తే కాళ్లు విరగ్గొడతామని బెదిరిస్తుంటారు, నువ్వు ఎంతసేపు నిలబడినా ప్రయోజనం లేదని నిరుత్సాహపరుస్తుంటారు. ఎవరెలా స్పందించినా గిద్వానీ ప్లకార్డు పారేయలేదు. ఎందుకంటే ఈ ప్లకార్డు చాలా జీవితాల్లో వెలుగు నింపింది. అతడి దగ్గర చాలా ఉదాహరణలే ఉన్నాయి.

గాయాలు మాయం

తాను చేసిన చిన్న తప్పిదంతో ఇంట్లోవారి చీవాట్లు తిని ఆత్మహత్యకు ఉపక్రమించిన ఓ కుర్రాడు గిద్వానీ ప్లకార్డు నినాదం చూసి తేరుకున్నాడు. అంత పెద్ద లోపం తనలో లేదని ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. ఈ విషయం ఆ కుర్రాడి తల్లే గిద్వానీని వెతుక్కుంటూ వచ్చి చెప్పింది. మరో యువతి భర్త ప్రవర్తన సరిగా లేక విడాకు లిచ్చింది. ఇక అప్పటి నుంచి ఆమెకు ఎన్నో అవమానాలు, సూటిపోటి మాటలు ఎదురయ్యాయి. ఎంత బాధనన్నా దిగమింగుకుని భర్తతోనే ఉండాలి గానీ ఇలా చేశావేమిటనే ప్రశ్నలు తనలోనే ఏదో లోపం ఉందనేలా ఆమెను సందేహపడేలా చేశాయి. కుంగిపోతున్న ఆ ముంబై యువతిని మామూలు మనిషిని చేసింది గిద్వానీ 'యూ ఆర్ పర్‌ఫెక్ట్' ప్లకార్డే. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి "నేను పర్‌ఫెక్ట్, బ్యూటిఫుల్ అనే మాట ఎదురవడం ఇదే తొలిసారి. చాలా థ్యాంక్స్" అని కంట తడి పెట్టుకున్నాడు. ఈ ప్లకార్డులను చేతపట్టుకుని నిలబడటం మొదట్లో కాస్త బెరుకుగానే అనిపించేది. కానీ, తొలి ప్రయత్నమే జీవితాంతం ఈ సాధన చేయడానికి సరిపడా బలాన్నిచ్చింది. బెంగళూర్‌లో తొలిసారిగా ప్లకార్డును ప్రదర్శిస్తున్నప్పుడు ఓ ఇటాలియన్ మహిళ వచ్చి గిద్వానీని హత్తుకుని కన్నీరు పెట్టుకుంది. అరగంటపాటు అతడి చేతిని వదలకుండా పట్టుకుని అలాగే నిలబడిపోయింది. ఎంతో అస్తవ్యస్తంగా గందరగోళంగా ఉన్న తన మనస్సుకు ఏం కావాలో సరిగ్గా అలాంటి చికిత్సనే చేశాయా మాటలని ఆమె గిద్వానీకి చెప్పింది. ఆ చిన్న మాటలే తనపై నమ్మకాన్ని కలిగించి, ధైర్యాన్నిచ్చి తన జీవితాన్ని నిలబెట్టాయని వ్యక్తంచేసింది. అంత బలీయంగా గిద్వానీ పాజిటివ్ ప్లకార్డు మార్పు తెస్తోంది. ప్రస్తుతం గిద్వానీ యూరప్ వెళ్లి ఫిలాసఫీపై పరిశోధన సాగించాలని నిశ్చయించుకున్నాడు. గిద్వానీని చూసి ప్రేరణ పొందిన మిత్రులు ప్రస్తుతం అతడి స్థానంలో ఇక్కడ నినాదాన్ని మోసుకుపోతున్నారు. ✦



మనిషి ముక్కు 50,000 రకాల వాసనలను గుర్తుంచుకో గలదు.

దంతాలు మనం పుట్టడానికి ఆరు నెలల ముందు నుంచే (తల్లి గర్భంలో వున్నప్పటి నుంచే) పెరగడం మొదలెడతాయి.

నిముషానికి 13 సార్లు కళ్లు ఆర్పుతాం.

పిల్లలు పుట్టినప్పుడు శరీరంలో 300 ఎముకలు వుంటాయి. వారు పెరిగి పెద్దయ్యేసరికి వాటి సంఖ్య 206 అవుతుంది.



ప్రపంచ జనాభాలో సుమారు 12 శాతం మంది ప్రజలు కొండలపై ఇళ్లు కట్టుకున్నారని ఐక్యరాజ్యసమితి అధ్యయనంలో తేలింది.

తెలుసా...

మన పాదాలలో 500,000 స్వేద గ్రంథులు వుంటాయి.

భూమి మీద నివసించే వాటిలో అత్యంత వేగంగా పరుగెత్తే జంతువు చిరుత పులి. ఇది గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో పరుగెత్తగలదు.

ఒక్కో వెంట్రుక జీవిత కాలం 3 నుంచి 7 సంవత్సరాలు.

ఈమూ పక్షికి తోక వుండదు. అది 1.5 మీటర్ల ఎత్తు, 160 కిలోల బరువు వుంటుంది. చాలా వేగంగా పరుగెత్తుతుంది. దాన్ని పట్టుకోవాలని ప్రయత్నిస్తే కాళ్లతో బలంగా తంతుంది.



అంగారక గ్రహంపై వున్న ఒలింపస్ మాన్స్ పర్వతం సౌర కుటుంబంలో ఎత్తైన పర్వతం.

వైకల్యం ఓడినవేళ...

ఒక్కోసారి చిన్న చిన్న సమస్యలే భూతాల్లా కనిపిస్తాయి. వాటిని అధిగమించడం అసాధ్య మని తలుస్తాం. సువిశాల ప్రపంచంలో మనకే ఎందుకిలా అని దిగులు పడిపోతాం. అలాంటిది పదమూడేళ్ల పసి వయసులో బాంబు దాడికి గురై చేతులు రెండూ తునాతు నకలైన మాళవిక మానసిక పరిస్థితి ఎలా వుండి వుంటుంది? ఆ గాయం నుంచి ఎప్పటికి ఎలా బైటపడింది? వైకల్యాన్ని ఓడించి ... ఎందరికో స్ఫూర్తి చిహ్నంగా ఎలా మారింది?

మాళవిక అయ్యర్... పుట్టింది కుంభకోణంలోనే అయినా తండ్రి ఉద్యోగ రీత్యా కుటుంబమంతా రాజస్థాన్ వెళ్లింది. పసితనంలో చాలా అల్లరి పిల్ల. ఆటలు, పాటలు, డాన్సులు, కబుర్లు...ఇది తప్ప మరో ప్రపంచం వుండేది కాదు. ఎప్పుడూ ఏదో ఒకటి నేర్చుకుంటూనే వుండేది. సాహస క్రీడలంటే తగని ఆసక్తి. కథక్ నుంచి స్కేటింగ్ వరకు ఏదీ వదిలేది కాదు. అలాంటి బాల్యంలో చేదు ఘటన ఎదురౌతుందని ఊహించనే లేదు. బాంబు పేలుడు జరిగినప్పుడు తన రెండు చేతులూ తునాతునకలై సుదూరంగా ఎగిరిపడ్డాయి. కాళ్లు సైతం తీవ్రంగా గాయపడ్డాయి. మరీ ముఖ్యంగా ఎడమ కాలు చర్మం సాయంతో వేళ్లాడుతోంది. ప్రధానమైన నరాలన్నీ తెగిపోయి తీవ్రమైన రక్తస్రావమైపోయింది. బీపీ పూర్తిగా పడిపోయింది. అలాంటి పరిస్థితుల్లో తనను అంబులెన్స్ సాయంతో జైపూర్ తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ఎంతో శ్రమించి కాళ్లను కాపాడాగలిగారు. చేతులు బాంబు పేలుడులోనే ఎరిగిపోయాయి కనక వైద్యులు ఏమీ చేయలేకపోయారు. నొప్పి తన నీడలా తయారైందనుకోవాలి. రాత్రింబగళ్లు దాని సాహచర్యంతోనే గడిచిపోయేవి. చికిత్స అలా నడుస్తూనే వుండేది. ఏడాదిన్నర తర్వాత మెల్లగా అడుగులు వేయగలిగింది. బయో ఎలక్ట్రిక్ చేతుల సాయంతో అక్షరాలు దిద్దసాగింది. మొదట్లో చాలా పెద్ద అక్షరాలు రాసేది. మామూలుగా రాయడానికి చాలా సమయమే పట్టింది. తనకెంతో ఇష్టమైన డాన్సు, ఈత, స్కేటింగ్ అన్నీ మూలన పడిపోయాయి. ఈలోగా మిత్రులు పదవ తరగతి పరీక్షలకు కూర్చుంటున్నారని తెలిసింది. అప్పటి నుంచి ఆమెలో ఏదో పంతం మొదలైంది.

పంతం పట్టి మరీ ....

తన శక్తినంతా చదువుమీదే పెట్టింది. కేవలం మూడు మాసాల్లో ప్రయివేటుగా పరీక్ష రాసి రాష్ట్రంలోకెల్లా పది మంది టాపర్లలో ఒకరిగా నిల్చింది. లెక్కలు, సైన్సు సబ్జెక్టులో నూటికి నూరు. హిందీలో 97 మార్కులు సాధించడమే కాదు. ఆ సబ్జెక్టులో స్టేట్ ఫస్ట్ కూడా. మరుసటి రోజు పత్రికల్లో ఆమె సాధించిన విజయం గురించిన కథనాలు చదివి మరింత స్ఫూర్తి పొందింది. అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం నుంచి పిలుపు రావడం, ఆయన అభినందనలు అందించడంతో ఆమె పొందిన ఉత్సాహం అంతా ఇంతా కాదు. ఢిల్లీలో అర్థశాస్త్రంలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసింది. ఆ తర్వాత సోషల్ వర్క్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసింది. అక్కడి నుంచి ఆమె విజయ ప్రస్థానం అలా కొనసాగుతూనే వుంది. 'టెడెక్స్' వేదికపై తన విజయగాథ వినిపించి వైకల్యాన్ని ఓడించిన యువకెరటంగా గుర్తింపు పొందింది. అక్కడి నుంచి స్ఫూర్తిదాయక ప్రసంగాలతో ఎందరినో ముందుకు నడిపిస్తోంది.

అమ్మే తోడు నీడ...

ఇన్నేళ్లల్లో ... ప్రతిక్షణం మాళవికకు తోడుగా...నీడగా...నిల్చింది ఆమె తల్లే. ఆమె మాటల ఊరడింపు, సేవల లాలింపు లేనట్టయితే ఏమయ్యేదో! "శారీరకంగానే కాక మానసికంగానూ దృఢంగా నిలబడ్డానికి, నడవడానికి, విజయ దుంధుభి మోగించడానికి అమ్మ చేసిన సేవలు, త్యాగమే కారణం' అంటుంది మాళవిక చమ్మగిల్మిన నయనాలతో. మహిళలకు ఒక చక్కని మాట చెప్తోంది. "మనం జీవితంలో ఎక్కడ ఏ స్థితిలో వున్నామో దాన్ని ముందుగా అంగీకరించాలి. ఆ తర్వాత ముందుకి నడిచేందుకు ప్రయత్నించాలి. అప్పుడు మనకు అడ్డుగా వున్న మంచు పొరలన్నీ తొలగిపోయి మార్గం సుస్పష్టమౌతుంది"

మాళవిక అయ్యర్

మట్టి కింద పట్టణం

మీకు క్లాస్టరోఫోబియా వుందా? అదే నండి బంధించిన చోటంటే భయం ఉందా? అయితే కూబర్ పెడీలో తలదాచుకోండి. టౌన్ మొత్తం ఎడారి అడుగున దాక్కున్న ఆ ప్రదేశం మీ భయం నుంచి విడుదల చేస్తుంది. అక్కడే బంధీలైపోవాలనిపించేలా మిమ్మల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది. ఎడారి మంటల్లోను చల్లని పగళ్లను పరచి కలతలేని కునుకునిస్తుంది. 'ది సిటీ అండర్‌గ్రౌండ్'గా పిలవబడే కూబర్ పెడీ ఆటవిక జాతులు దాక్కున్న గుహల సముదాయం కాదు, అధునాతన సొబగులు అద్దుకున్న నేలమాళిగ గృహాల పట్టణం.

ఆస్ట్రేలియా ఎడారి నిండిన దేశం. అక్కడే చెట్టంటూ కనిపించని ఎడారి ప్రాంతం కూబర్ పెడీ. అక్కడి పూర్వజాతుల భాషలో 'కూప పిటీ'నే ఈ కూబర్ పెడీ. 'తెల్లవాడి బొరియ' అని దాని అర్థం. ఎప్పుడో వందేళ్ల క్రితం పెట్టిన ఈ పేరు కచ్చితంగా సరిపోతుంది ఇప్పటికీ. అయితే తాత్కాలికంగా తలదాచుకునేందుకు తవ్విన బొరియలే ఇప్పుడు అధునాతన సౌకర్యాలున్న త్రీ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లు అయ్యాయి. హోటళ్లు, మోటెళ్లు, పబ్‌లు, కేసినోలు, మ్యూజియాలు, మినీ థియేటర్లు ఒక్కటేమిటి సర్వహంగులు ఏర్పాటు చేసుకున్నారు నేలను తవ్వి. ఒక్క ఎంటర్‌టైన్‌మెంటేనా ఆధ్యాత్మికత కోసం అద్భుతమైన రెండు చర్చిలను కొలువుతీర్చారు. సుమారు 3,500 మందికి పైగా ఉండే ఈ పట్టణం పై నుంచి గుర్తు పట్టడం కష్టమే. గూగుల్ ఎర్త్‌తో లొకేట్ చేయడం ఎడారిలో రాయిని వెతకడమే. నిలవనీడలేని జీవనానికి అనుకూలం కాని కూబర్ పెడీకి గుర్తింపు తెచ్చింది ఈ బొరియ గృహాలే. ఆస్ట్రేలియాలో తప్పక చూడాల్సిన పర్యాటక ఆకర్షణల్లో ఒకటిగా స్థానం తెచ్చుకోవడానికి కారణం ఈ ప్రత్యేక ఇంటి నిర్మాణాలే.

మైనింగే కారణం

కూబర్ పెడీ మట్టి నుంచి ముచ్చటైన పట్టణంగా మారడానికి కారణం అక్కడి ఖనిజ సంపదే. ఓపల్స్ అనే ప్రత్యేకమైన రత్నాలకు ఇది నిధి. ప్రపంచవ్యాప్తంగా వెలుగులోకి వచ్చిన ఓపల్స్‌లో 95 శాతం ఇక్కడి నుంచి తవ్వి తీసినవే. ప్రపంచ ఓపల్ రాజధానిగా వెలుగొందిందీ పట్టణం. ఓపల్స్ వెలికితీసేందుకు ఇక్కడ మైనింగ్ చేపట్టారు. 1915 ఫిబ్రవరి 1న తొలి ఓపల్ లభ్యమవడంతో గని పనులు ముమ్మరం చేశారు. తొలుత భూమిపైనే కార్మికులు వసతి ఏర్పాట్లు చేసుకోగా కొద్ది కాలానికే అక్కడి వాతావరణానికి తట్టుకోలేకపోయారు. పగలు 50 డిగ్రీలకు పైగా, రాత్రుళ్లు సున్నా డిగ్రీల సెంటిగ్రేడ్ దిగువకు మారిపోయే ఉష్ణోగ్రతలతో బేజారెత్తిపోయారు. ఆరుబయట ఎండ మండిపోతుంటే గనుల్లో మాత్రం చల్లగా ఉండేది. రాత్రుళ్లు గడగడలాడిస్తుంటే ఇక్కడ మాత్రం వెచ్చగా ఉండేది. బొరియల్లోనే ఎందుకు తల దాచుకోకూడదని కొందరు కార్మికులు తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేసుకున్నారు. ఆ తర్వాత కార్మికుల కుటుంబాల నివాసాలన్ని కందకాల్లోకి చేరిపోయాయి. అలా ఒక్కో భాగం బొరియ ఇళ్లతో నిండిపోతూ వందలాది గృహాలు వెలిశాయి. తొలుత గని కార్మికుల కుటుంబాలు మాత్రమే ఉండగా ఆ తర్వాత రెండో ప్రపంచ యుద్ధ నాటి పరిస్థితుల్లో తలదాచుకునేందుకు చాలా మంది యూరోపియన్లు ఈ ప్రాంతానికి తరలివచ్చారు. ఇప్పుడు సుమారు 45 దేశాల నుంచి వచ్చిన ప్రజలు అక్కడ కనిపిస్తారు. కూబర్ పెడీ గృహాల సముదాయాలు చెదిరిపోకుండా ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంది. భారీ మైనింగ్‌తో అవి దెబ్బతినే అవకాశముండటంతో దాన్ని నిరుత్సాహపరిచే నిబంధనల్ని అమలుచేస్తోంది. ఒకరికి 165 చదరపు అడుగుల ప్రదేశాన్ని మాత్రమే తీసుకునే అవకాశాన్నిస్తోంది. దీని వల్ల భారీ యంత్రాలు, తవ్వకాల నుంచి ఈ ప్రాంతం తప్పించుకుంది. దగ్గరలో బంగారు, ఇనుము, కాపర్, ఇంధన మైనింగ్‌లు ఉన్నా వాటి ప్రభావం పడకుండా చూస్తున్నారు.

ఇళ్లే ఆకర్షణ

కూబర్ పెడీలో పట్టణం అంతర్భాగంలో దాక్కుంటే గుర్తుపట్టడమెలా అంటే అక్కడ నేల పైకి పొడుచుకు వచ్చినట్టుండే షాఫ్ట్‌లను చూసే. గాలి, వెలుతురుకు వీటిని ఏర్పాటు చేసుకున్నారు. ఉక్కు లేదా కాంక్రీట్ గొట్టాలే ఇవి. పైకప్పుతో వెడల్పుగా ఉండే ఈ గొట్టాల ద్వారానే వంట గదికి కావాల్సిన కాంతి, వాయువు అందుతాయి. పడక గదులు, హాల్, డ్రాయింగ్ రూమ్‌లకు ప్రత్యేకంగా షాఫ్ట్‌లుంటాయి. మొత్తం కూబర్ పెడీలో దాదాపు 2.5 లక్షల షాఫ్ట్‌లున్నాయి. బొరియల్లో ఇళ్లనగానే అవి ఇరుగ్గా మూసుకుపోయి ఉంటాయనుకుంటే పొరబాటే. విశాలమైన గదులు స్వచ్ఛమైన గాలితో నిండి ఉంటాయివి. టీవీ, రిఫ్రిజరేటర్, కంప్యూటర్లు, వాషింగ్ మెషీన్లు, డిష్ వాషర్లు వంటి అన్ని గృహోపకరణాలు ఇక్కడి ఇళ్లలో చూడొచ్చు. విలాసవంతమైన ఇంటీరియర్ డిజైనింగ్ సామగ్రితో కనిపిస్తాయి. ఖరీదైన సోఫాలు, డైనింగ్ సెట్లు, బెడ్‌లు స్థానికుల వైభోగాన్ని చూపెడతాయి. ఈ ఇళ్లకు మరో ప్రత్యేకత ఏమిటంటే నకిలీ కిటికీలు ఉంటాయి. వీటి ఉపయోగం లేకున్నా ఇంటీరియర్ డిజైనింగ్‌లో భాగంగా చూస్తారు. బయట ఉష్ణోగ్రతలు ఎలా ఉన్నా లోపల మాత్రం ఎప్పుడు ఒకే స్థాయి ఉష్ణోగ్రత ఉంటుంది. ఎయిర్ కండిషనింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు దాదాపు అరుదు. అక్కడి నిద్రాసౌఖ్యం మరెక్కడా లభించదు. దాదాపు పరిసరాలన్ని స్తంభించిపోయినంత నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ఉంటాయి పడక గదులు. చాలామంది పర్యాటకులు ఇక్కడ ఒక్కసారిగా బద్ధకస్తులైపోయి పక్క నుంచి అస్సలు లేవరట. సహజసిద్ధంగా నారింజ వర్ణంలో ఉండే మట్టికి లేత గులాబీ, వంగపువ్వుల రంగు శోభని ముడి ఖనిజ మిశ్రమాలు ఇస్తాయి. విద్యుత్ వెలుగుల్లో చాలా వర్ణశోభితంగా ఉంటాయి ఇళ్లు. రూఫ్‌కు మాత్రం సీలింగ్ వేస్తారు. లేకపోతే మట్టి రాలి దుమ్ము నిండిపోతుంది. ఎంత విశాలంగా గదుల్ని తవ్వినా పైకప్పు కూలుతుందనే భయం ఉండదు. కారణం దృఢంగా ఉండే ఇసుక రాయి వల్లే. తవ్వడానికి మెత్తగా తేలిగ్గా ఉండే ఈ సాండ్‌స్టోన్ వల్ల నిర్మాణ వ్యయం చాలా తక్కువ. చాలావరకు కుటుంబ సభ్యులే కావాల్సిన స్పేస్‌ను తవ్వుకుంటుంటారు. కప్‌బోర్డులు, అరలు, వార్డ్‌రోబ్‌లు, స్టాండ్‌లు వంటి చిన్న స్పేసెస్‌ను వారే కళాత్మకంగా చెక్కుకుంటారు. వారికి అదో హాబీ కూడా. ఎడారి వాతావరణానికి తట్టుకుని నిలబడే చిన్నచిన్న పూల మొక్కలు ఆహ్లాదం కోసం ద్వారాల ఎదుట బాహ్యప్రదేశంలో పెంచుకుంటారు. చూడదగిన నిర్మాణాలు చర్చిలు. చాలా విశాలంగా ఉండే పెద్ద హాల్ వీటికి ఉంటాయి. ఇక్కడో నగల దుకాణం కూడా ఉంది. వారికి పేరు తెచ్చిన ఓపల్స్‌తో పాటు బంగారు నగలూ ఇక్కడ ఆకట్టుకుంటాయి.

అంతా హెచ్చరిక బోర్డులే..

ప్రధాన జనావాసాలకు చాలా దూరంగా విసిరికొట్టినట్టుండే ఈ ప్రాంతంలో ఇసుక తుఫానులు సర్వసాధారణం. అక్కడక్కడ కొన్ని సైన్ బోర్డులు పట్టణ బొరియ గృహాలకు దారిని చూపెడతాయి. ఇక్కడ ప్రమాదకరంగా ఉండే చాలా బొరియలు,

గుంతలు ఇక్కడ అనేకం ఉన్నాయి. స్థానికులు కూడా వీటిని గుర్తించలేరు. వాటి వద్ద కూడా హెచ్చరిక బోర్డులు పెట్టారు. ఓ రకంగా బోర్డులే చెట్లలా పరుచుకున్నట్టుంటాయి. ఇక్కడ ఓ గోల్ఫ్ కోర్స్ ఉంది. గడ్డిపోచ కూడా లేని ప్రపంచంలోనే అతి అరుదైన గోల్ఫ్ కోర్సుగా గుర్తిస్తారు దీన్ని. మొత్తం ఎర్రటి మట్టితో కనిపించే ఈ గోల్ఫ్ కోర్సులో ఆటను రాత్రుళ్లు మాత్రమే ఎక్కువగా ఆడతారు. దీనికోసం వెలిగే బంతులను ప్రత్యేకంగా రూపొందించారు. ఇక్కడి సమాధిని కూడా పర్యాటక కేంద్రంగా చూస్తారు. మూసివేసిన మైనింగ్ ప్రదేశాలు కూడా చూడదగ్గవే. ఇక్కడ ఆతిథ్యానికి ఫుల్‌మార్కులు పడిపోయాయి. రకరకాల వసతి సదుపాయాలు ఇక్కడ లభిస్తాయి. కొందరు స్థానికులు కూడా తమ ఇళ్లలో ఆతిథ్యం ఇస్తారు. ఇక్కడి బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ (బీఅండ్‌బీ)కి ఆస్ట్రేలియాలోనే బెస్ట్ బీఅండ్‌బీ వసతి కేంద్రంగా అవార్డ్ వచ్చింది.

అడిలైడ్ నుంచి 846 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది కూబర్ పెడీ. అడిలైడ్, డార్విన్‌ల మధ్య ఉండే ఈ ప్రాంతానికి ఆస్ట్రేలియా రైల్వేలోనే అతి అబ్బురమైన ది ఘాన్ రైలు సర్వీసు కూబర్ పెడీ పక్కనుంచి వెళుతుంది. ప్రకృతి అందాలను పర్యాటకులకు చూపిస్తూ పోయే ఆ రైలు కూబర్ పెడీకి 41 కిలోమీటర్ల దూరంలోని మార్గరీ సైడింగ్ వద్ద పర్యాటకుల కోసం నిలుస్తుంది. అయితే రైలు ఎక్కే ముందే మార్గరీ నుంచి రవాణా ఏర్పాట్లు చేసుకోవాల్సిందే. లేకుంటే అనుమతించరు. అక్కడి వాతావరణం, ఒంటరి ప్రాంతమే కారణం. మెయిల్ కూడా ఉంది. స్టువార్ట్ హైవేకు దగ్గరగా ఉండే ఈ ప్రాంతానికి రోడ్డు ప్రయాణం కాస్త తేలిక. ఊడ్‌నడాట్ట, విలియం క్రీక్ అవుట్ బ్యాక్‌లకు కూబర్ పెడీ గేట్ వే. దీని మీదుగానే ఆ ప్రాంతాలకు చేరుకుని క్యాంపులు వేసుకుంటుంటారు. ఇన్ని అద్భుతాలకు ఆలవాలమైన కూబర్ పెడీలో పర్యటించడం కచ్చితంగా వింత అనుభూతిని కలిస్తుంది.

-జేఎస్పీ

హోల్ 'సెల్'

అద్భుతాలు అనామకంగా పుడతాయి. ఎవ్వరికీ తెలీవు. మౌనంగానే పెరుగుతాయి. ఎవ్వరూ గ్రహించరు. నిశ్శబ్దంగా విస్తరిస్తాయి. ఎవ్వరూ పట్టించుకోరు. ఎప్పుడో వెనక్కి తిరిగి చూస్తే గానీ తెలీదు. అవి అనామక అద్భుతాలు గానే ఆరంభమయ్యాయని అప్పుడు అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తారు. సరిగ్గా ఇటువంటి అద్భుతమే రెండు దశాబ్దాల క్రితం జులై మాసపు చివరి రోజున మన దేశంలో చోటు చేసుకుంది. మామూలుగానే అప్పుడు అది విప్లవం అవుతుందని ఎవ్వరూ ఊహించలేదు. అది దినదినాభివృద్ధి చెందుతుంటే మామూలే అనుకుని ఆ ప్రవాహంలో కలిసిపోయి దానినీ మనలో కలిపేసుకున్నాం.

- కాకర్లమూడి విజయ్
9849061159

ఇరవై ఏళ్ళ తరువాత ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే సుమారు నూట ఇరవై తొమ్మిది కోట్ల భారత దేశపు జనాభాలో తొంభై కోట్ల మంది జీవితాలతో పెనవేసుకున్న ఆ విప్లవం పేరు మొబైల్ ఫోన్ లేకపోతే నామోషీగా భావించే స్థాయికి మనల్ని తెచ్చిన విప్లవం అది. మొబైల్ ఫోన్ వినియోగదారుల జాబితాలో మనల్ని ప్రపంచం రెండవ స్థానంలో నిలిపింది. నూట ఇరవై ఏడున్నర కోట్ల వినియోగదారులతో మనకంటే పైస్థానంలో చైనా వున్నా, సంపన్న, అభివృద్ధి చెందిన దేశంగా పేరొందిన అమెరికా కేవలం ముప్ఫై రెండు కోట్ల వినియోగదారులతో మన తరువాతి స్థానంలో ఉంది. అయితే సరిగ్గా పదేళ్ళ క్రితం మన దేశం ఎనిమిది కోట్ల మొబైల్ ఫోన్ల వినియోగదారులతో ఆరవ స్థానంలో ఉండేది!

తీగలు లేని తొలి కాల్

అలెగ్జాండర్ గ్రాహంబెల్ 1876లో టెలిఫోన్ ఆవిష్కరించి ఒక అద్భుతానికి తెర లేపాడు. అది ప్రపంచాన్ని తీగలతో కలిపివేసింది. దాదాపు వంద సంవత్సరాలకు, 1973, ఏప్రిల్ మూడవ తేదీన తీగలు లేకుండా తొలి కాల్ వెళ్ళింది. మోటోరోలా కంపెనీలో సీనియర్ ఇంజనీర్ మార్టిన్ కూపర్ తమ పోటీ కంపెనీకి ఫోన్ చేసి నేను మొబైల్ ఫోన్ నుండి మాట్లాడుతున్నాను అన్నాడు. కూపర్ వాడిన ఫోన్ బరువు ఏకంగా రెండు కిలోలు! దానిని పది గంటలు చార్జ్ చేస్తే అరగంట మాత్రమే వాడగలిగేవారు.

ఆ సంఘటన జరిగిన పదేళ్లకు మోటోరోలా మొట్టమొదటి ఫోన్ ని మార్కెట్‌లో విడుదల చేసింది. దాని ధర అప్పట్లోనే మూడు వేల తొమ్మిది వందల తొంభై అయిదు డాలర్లు (ఇప్పటి మారకం ప్రకారం అది రెండు లక్షల అరవై వేల పై చిలుకు!). ఆ తరువాత తొంభయ్యవ దశకం ప్రారంభంలో నోకియా కూడా తన మొబైల్ ఫోన్ రూపొందించి విడుదల చేసింది. అదీ సుమారు ఎనిమిది వందల గ్రాములు బరువు తూగింది. తొంభయ్యవ దశకం అంతమయ్యే దశలో మొబైల్ విస్తరణ ఆరంభమయ్యింది. ఇప్పుడు అప్రతిహతంగా అభివృద్ధి చెందుతూనే ఉంది.

మన దేశంలో మొబైల్ ఫోన్ నుండి వెళ్ళిన తొలి కాల్ 1995 జులై 31 వ తేదీన. అప్పటి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసు కోల్‌కొతాలోని రైటర్స్ బిల్డింగ్ నుండి ఢిల్లీలోని అప్పటి సమాచార శాఖా మంత్రి సుఖ్ రామ్‌కి మొబైల్ ఫోన్ ద్వారా కాల్ చేశారు. అప్పట్లో మొబైల్ ఫోన్లు పాతిక, నలభై వేల ఖరీదు ఉండేవి. పైగా వాటితో కాల్ చేసినందుకు నిమిషానికి 16 రూపాయలు.కాల్ అందుకున్నందుకు నిమిషానికి 8 రూపాయలు. అంటే నిమిషం మాట్లాడితే 24 రూపాయలు వదిలేవి. సరిగ్గా పదేళ్ళ తరువాత

దాదాపు ఏడు కోట్ల మంది చేతుల్లో మొబైల్ ఫోన్లు అమరిపోయాయి. ప్రస్తుతం ఆ సంఖ్య 90 కోట్లకి చేరింది. రోజు రోజుకి పెరుగుతూనే ఉంది. దాదాపు పన్నెండు కోట్ల మంది స్మార్ట్ ఫోన్‌లు వాడుతున్నారు.ఇరవై ఒక్క కోట్ల మంది మొబైల్ ఫోన్ ద్వారా ఇంటర్నెట్ వాడుతున్నారు. అంటే నూటికి డెబ్భై ఏడు మంది ప్రస్తుతం మొబైల్ ఫోన్లు వాడుతున్నారు. గత జూన్‌లో నిర్వహించిన ఏడు దేశాల సర్వేలో నూటికి డెబ్భై నాలుగు మంది భారతీయులు తమ సెల్ ఫోన్లతోనే నిద్రిస్తారని చాలా మంది స్నానానికి వెళ్ళేటప్పుడు కూడా తమతో పాటు తమ ఫోన్లను తీసుకెళతారని తేలింది.

అసలు సెల్‌ఫోన్ ఆలోచన అమెరికాలో 1947లోనే ఆరంభమైంది. చిన్న చిన్న ప్రాంతాలుగా విడగొట్టి ఆయా ప్రాంతాల్లో రేడియో ఫ్రీక్వెన్సీని వాడటం వల్ల మొబైల్ ఫోన్లను విస్తరించవచ్చు. అన్నది అప్పటి ఆలోచన. కానీ అప్పట్లో అందుకు తగ్గ సాంకేతిక విజ్ఞానం అందుబాటులో లేదు. అమెరికా టెలిఫోన్ అండ్ టెలిగ్రాఫ్ బెల్ కంపెనీలు సెల్ టవర్‌ల నిర్మాణం ప్రతిపాదించాయి. ఒక్కో టవర్ ఒక్కో సెల్ పరిధి వరకూ విస్తరించి వుండే విధంగా సెల్ ప్రాంతాన్ని వినియోగదారుడు దాటినప్పుడు కాల్‌లు మరో టవర్‌కి మారే విధంగా వ్యవస్థ సూచించాయి.

బెల్ కంపెనీ 1947లోనే పోలీస్ వాహనాలతో మొబైల్ ఫోన్ అమర్చే ఆలోచన చేసినా, మోటోరోలా కంపెనీనే మొబైల్ ఫోన్‌ని అభివృద్ధి చేసింది. మార్టిన్ కూపర్ అనే మోటోరోలా ఇంజనీర్ తొలి మొబైల్ ఫోన్ ఆవిష్కర్తగా పేరొందాడు.

ఎటి అండ్ టి, బెల్ కంపెనీల సెల్ వ్యవస్థ ఆలోచన 1977 నాటికి రూపుదాల్చింది. మరో రెండేళ్ళకు టోక్యోలో తొలి వాణిజ్య పరమైన సెల్ వ్యవస్థ మొదలైంది. అలా అలా సెల్ ఫోన్ ఆలోచన కి బీజం పడిన ముప్పై ఏడేళ్ళకు గాని అమెరికాలో ఆ ఫోన్లు ప్రజలకు అందుబాటులోకి రాలేదు. పందొమ్మిది వందల ఎనభై ఏడు కల్లా అక్కడ సెల్ ఫోన్ వినియోగదారులు పది లక్షలను దాటిపోయారు.

పేజర్ల కాలం

మొబైల్ కంటే ముందు, ల్యాండ్ ఫోన్ తరువాత పేజర్ అనే పరికరం ఒకటి వాడుకలో వుండేది (నిజానికి ల్యాండ్ ఫోన్‌కి అనుబంధంగా ఒక చిన్న పరిధిలో పనిచేసే కార్డ్‌లెస్ ఫోన్‌లు కూడా కొంత కాలం వాడుకలో ఉండేవి).

అమెరికాలో పేజర్‌లు 1950లో వాడకంలోకి వచ్చినా మన దేశంలో 1995లోఅడుగుపెట్టాయి. చిన్న సబ్బు బిళ్ళ సైజులో ఉండే ఆ పరికరంలో మనం సదరు వ్యక్తికీ ఒక సంక్షిప్త సందేశం మాత్రమే పెట్టవచ్చు. మనం పేజర్ కంపెనీకి ఫోన్ చేసి మన సందేశం ఏ పేజర్‌కి ఇవ్వాలో చెబితే వారు దాన్ని అవతలి వ్యక్తి పేజర్‌కి పంపేవారు. అది చూసుకుని అవతలి వ్యక్తి కాల్ చేయడం వంటివి చేసేవారు. ఆ విధంగా పేజర్‌లు ఒక వైపు మాత్రమే పనిచేసేవి. అంటే అవి మనకి వచ్చిన సందేశాన్ని చూడటం వరకే ఉపయోగపడేవి. ఆ రోజుల్లో పేజర్‌లకి మొలకి అమర్చుకునే వారు (మొబైల్ ఫోన్లు వచ్చిన కొత్తల్లో వాటినీ మొలకు అమర్చుకునేవారు). రెండు మూడేళ్ళకు పేజర్‌లు ఇరవై లక్షల వినియోగదారులకు చేరింది. కానీ 2002 కల్లా పేజర్ల వాడకం క్షీణించసాగింది. మరో రెండేళ్ళకు మొబైల్ ఫోన్ల రకరకాల రింగ్‌టోన్‌ల హోరులో పేజర్‌ల 'బీప్'లు మూగపోయాయి.

మొబైల్ ఫోన్లు కొత్తలో పెద్దగా బరువుగా చాలా వరకూ బయటకి పొడుచుకు వచ్చే ఏరియల్‌తో ఉండేవి. వాటిలో స్క్రీన్ చిన్నగా డయల్ ప్యాడ్ పెద్దగా ఉండేవి. వాటిని ఎక్కువగా ఫోన్ చేయడానికి ఫోన్లు అందుకోవడానికి మాత్రమే వాడేవారు. ఇప్పట్లో ఇతర హంగులు ఉండేవి కాదు. ఒకటి రెండు గేమ్స్ కూడా ఉండేవి.

మొబైల్ ఫోన్లు ముతకగా, బరువుగా వున్నా మరో ఆలోచన, మరో అవకాశమూ లేక అవే వాడుకునే రోజులు అవి. అప్పుడు వచ్చింది మొబైల్ ఫోన్ ప్రపంచంలోకి మరొక విప్లవం దాని పేరు ఐఫోన్. రెండు వేల ఏడవ సంవత్సరంలో ప్రజల ముందుకు వచ్చిన ఐఫోన్ అప్పటివరకూ వున్నా ఫోన్లన్నిటిని తోసి రాజంది. అసలు మొబైల్ ఫోన్ అంటే ఇదీ అని నిర్దేశించింది. అప్పటి వరకూ ఊహకు కూడా అందని టచ్ స్క్రీన్ కళ్ళు చెదిరే రంగు రంగుల పెద్ద స్క్రీన్ డిజిటల్ ఫోటోలు తీసే కెమెరా, వీడియోలు, సినిమాలు చూడగలిగే పెద్ద స్క్రీన్, ఇంటర్నెట్ , బ్రౌజర్ అసలు కీ ప్యాడ్ అనేది లేకుండా ఫోన్ అంతా స్క్రీన్ ఉండటంతో సిసలైన స్మార్ట్ ఫోన్‌గా ఐఫోన్ అవతరించింది. వేళ్ళ కొనలతో స్క్రీన్ మీద మాయాజాలం చేయడం ప్రపంచ మొబైల్ ఫోన్ల వినియోగదారులని అద్భుతాను భూతికి గురిచేసింది.

ఆ మాత్రం కొస అందిస్తే చాలు అల్లుకుపోమా అన్నట్టు అన్ని కంపెనీలు కీ బోర్డ్‌ని తీసేసాయి. సన్నని ఫోన్లు, టచ్ స్క్రీన్‌తో మరింత పెద్ద ఫోన్లను చేయడం మొదలెట్టాయి. ఇప్పుడు కంప్యూటర్ల కంటే వేగంగా పనిచేసే ఫోన్లు వచ్చేసాయి.

నిజమైన విశ్వరూపం

మొబైల్ ఫోన్లు ప్రజలకు అందుబాటులోకి



సిమ్‌కార్డ్

మొబైల్ ఫోన్లలో సిమ్ కార్డ్ వాడటం తెలిసిందే సబ్స్క్రైబర్ ఇడెంటిటీ మాడ్యూల్ అనబడే ఈ కార్డ్‌లో ఒక చిప్ ఉంటుంది. ఈ కార్డ్ వేస్తేనే మొబైల్ ఫోన్‌ని వాడవచ్చు. మొదటి సిమ్ కార్డ్ ఫిన్లాండ్‌లో రేడియోలింజా అనే కంపెనీ కొరకు తయారు అయింది. ఇపుడు ఒకటి కంటే ఎక్కువ సిమ్ కార్డులు అమరే ఫోన్లు కూడా వచ్చేసాయి.

వచ్చినప్పుడు అవి ఫోన్ చేయడానికి ఫోన్ అందుకోడానికీ మాత్రమే వచ్చేవి. కానీ సాంకేతిక అభివృద్ధి చెందడంతో ఇప్పుడు ఫోన్లు కేవలం కాల్ చేయడంకంటే మరెన్నో పనులను చేస్తున్నాయి.

ఒకప్పుడు మనం ఫోటోలు తీయడానికి కెమెరాలు, సంగీతం వినడానికి వీడియోలు చూడటానికి ఇలా ఒక్కో పనికీ ఒక్కో ఉపకరణం వాడేవాళ్ళం. స్మార్ట్ ఫోన్‌లు వచ్చాక అన్ని ఉపకరణాలూ ఒకే చోట లభించాయి. మొబైల్ ఫోన్ ఉంటే మనకి అవసరంలేని ఇతర ఉపకరణాలు కెమెరా, కంప్యూటర్, మ్యూజిక్ ప్లేయర్, వీడియో ప్లేయర్, చేతి గడియారం, టార్చ్ లైట్, ఎఫ్ఎం రేడియో, వీడియో రికార్డర్, ఆడియో రికార్డర్, మార్గం చూపించే నావిగేషన్ వ్యవస్థ అలారం, టీవీ, ఏసిల రిమోట్ కంట్రోల్, సమాచారాన్ని నిలువ చేసే పోర్టబుల్ యూ ఎస్‌బీ స్టోరేజ్, పాకెట్ డిక్షనరీ, అనువాద పరికరం, స్కానర్, టెలివిజన్ దిక్సూచి, కాలిక్యులేటర్ మెదలైనవి.

నాలుగు తరాలు

90 వ దశకం ముందు వరకూ వచ్చిన మొబైల్ ఫోన్లు మొదటి జనరేషన్. వాటిని క్లుప్తంగా 1జి అంటారు. ఈ తొలి తరం ఫోన్లు ఒకేసారి అనేక కాల్స్‌ని తీసుకోగలిగినా అవి కాస్త పాతరకం 'అనలాగ్' టెక్నాలజీ నే వాడేవి. రెండవ తరం 2జి ఫోన్లు. 1991లో ఫిన్లాండ్‌లో ఆరంభించారు. ఇవి డిజిటల్ టెక్నాలజీ ని వాడేవి. వీటిలో సమాచారం స్పష్టంగా ఉండేది. వీటి రాకతో మొదటితరం ఫోన్లు తగ్గిపోయాయి. ఇవి గ్లోబల్ సిస్టమ్ ఫర్ మొబైల్ కమ్యూనికేషన్స్ జి.ఎస్.ఎమ్ అనే ప్రామాణిక వ్యవస్థపై ఆధారపడి ఉండేవి. ఇప్పుడు జిఎస్ఎమ్ ప్రామాణికత 219 దేశాలు, ప్రాంతాలలో పనిచేస్తోంది. ముందుగా ఇది కేవలం స్వర సంబంధ సమాచారానికి మాత్రమే పరిమతమైనా.. ఫోను పోనూ డేటాను కూడా పంపించడం లో సఫలమైంది. మూడవ తరం 3జి టెక్నాలజీ 2001 లో జపాన్‌లో డొకోమోతో ఆరంభమైంది. ఈ వెసులుబాటు వున్న ఫోన్లలో డేటా వేగంగా ప్రసారమౌతుంది. కానీ వినియోగదారుల అవసరాలూ అలవాట్లు పెరగడంతో డేటా ట్రాన్స్ఫర్‌కి త్రీజీ కూడా సరిపోవడం లేదు. అందుకే త్రీజీ కంటే పదింతల డేటా ప్రసారానికి అనువైన నాల్గవ తరం టెక్నాలజీ రంగ ప్రవేశం చేసింది.

ఉద్యమాలకు ఊతం

మొబైల్ ఫోన్లు మన జీవితాలను నియంత్రిస్తుంటే సామాజిక స్పృహని మాత్రం ఎందుకు వదులుతాయి? వేలాది మందిని ఒకే తాటిపై నడపడానికి మొబైల్ ఫోన్లు అద్భుతంగా ఊతం అందిస్తున్నాయి. వాట్సప్



గ్రూప్‌లు, మూకుమ్మడి ఎస్.ఎం.ఎస్‌లు దేశం మొత్తం మీద చైతన్యాన్ని రగిలిస్తున్నాయి. ఇటీవలే జరిగిన అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం కేవలం మొబైల్ ఫోన్‌ల ద్వారానే జన శక్తిని కూడగట్టుకుంది. ఈ మెయిల్‌లకు తోడు ఫోన్‌ల ద్వారా అనేక మందిని దానిపై అవగాహన కలిగించడమే కాకుండా అందులో పాలుపంచుకునేలా చేసింది. ఒక రకంగా ప్రజల చేతిలో అద్భుత శక్తి వచ్చినట్టే. ఇంతా చేసి ఈ ఉద్యమంలో పాల్గొనడానికి చేయవలసిందల్లా ఒక నెంబర్ కి మిస్డ్ కాల్ ఇవ్వడమే. అవినీతికి వ్యతిరేకంగా పాతిక లక్షల మిస్డ్ కాల్లు

స్మార్ట్ ఫోన్

స్మార్ట్ ఫోన్ అనేది ఇప్పుడు చాలా సాధారణం అయిపోయింది. నిజానికి అది ఫోన్ కాల్స్ కంటే ఎక్కువ... చాలా ఎక్కువ... పనులు చేస్తోంది. మామూలు మొబైల్ ఫోన్ (దీనిని ఇప్పుడు ఫీచర్ ఫోన్ అంటున్నారు) అంటే ఫోన్ చేయడానికి మెసేజ్‌లు, చిన్న పాటి ఎం.ఎం.ఎస్‌లూ పంపడానికి పరిమితమైంది. అదే స్మార్ట్ ఫోన్ అయితే మామూలు మొబైల్ ఫోన్ చేసే పనులతో బాటు కంప్యూటర్‌కి మాత్రమే చేతన య్యే పనులను కూడా చేస్తుంది. ఇంటర్నెట్‌కి కనెక్ట్ కావడం, మెయిల్స్ పంపుకోవడం, వీడియోలు డౌన్లోడ్ చేసుకోవడం, ఫోటోలు తీసి అందరితో పంచుకోవడం ఆఫీస్ డాక్యుమెంట్లను తయారు చేయడం.ఇలా ఎన్నో వెసులుబాట్లు వుంటాయి. పైగా స్మార్ట్ ఫోన్‌లు కంప్యూటర్‌ల లాగా ఒక ఆపరేటింగ్ సిస్టం (వో ఎస్)పై పనిచేస్తాయి. ప్రస్తుతం యాపిల్ కంపెనీ ఐఫోన్లు ఐవోఎస్, బ్లాక్బెర్రీ ఫోన్లు, బ్లాక్ బెర్రీ వో ఎస్, మైక్రోసాఫ్ట్ ఫోన్లు విండోస్ వోఎస్, మిగతా ఫోన్లు గూగుల్ తాలుకూ ఆండ్రాయిడ్ వోఎస్ ని వాడుతున్నాయి.వీటన్నిటికి తోడు స్మార్ట్ ఫోన్‌లలో ప్రత్యేకమైన యాప్స్ డౌన్ లోడ్ చేసుకోవచ్చు. ఇప్పుడు వైఫై ద్వారా ప్రయాణి ంచే మార్గాన్ని కూడా ముందే చూసుకునే వీలు కల్పించే 'జీపీఎస్' సినిమాలూ పాటలూ, ఆన్ లైన్‌లో వ్యాపారం, స్టాక్ మార్కెట్‌లో పాల్గొన డం. బ్యాంకు లావాదేవీలు, బిల్లులు కట్టడం వీడి యో కాల్, వీడియో చాట్, గ్రూప్ గేమ్స్ ఒకటే మిటి ఒక కంప్యూటర్‌ని చేతిలో పెట్టుకుని ప్రపంచ యాత్ర చేసినట్టే



మొబైల్ ఫోనా? సెల్ ఫోనా?

పేరేదైతేనేం. విషయం మాత్రం ఒక్కటే రెండవ ప్రపంచ కాలంలో దూరవాణిగా రేడియోని వాడినా తొలి మొబైల్ హ్యాండ్ సెట్‌ని 1979లో జపాన్‌లో ఉపయోగించారు. అమెరికాలో ఈ పరికరాన్ని సెల్ ఫోన్‌గా పిలిస్తే యూరప్, మిగతా దేశాలు మాత్రం మొబైల్ ఫోన్‌గా పిలుస్తున్నాయి. అయితే ఈ ఫోన్లు వాడే నెట్ వర్క్ మాత్రమే సెల్యూలార్ కానీ పరికరం కాదు. కాబట్టి మొబైల్ ఫోన్ అనడమే కరెక్ట్ అయినా ఇప్పుడు రెండు పేర్లూ వాడుకలో ఉన్నాయనుకోండి.

నమోదయ్యాయి. అంత మందిని కూడగట్టడం ఎంత కష్టమో తెలియంది కాదు. అదే విధంగా ఢిల్లీ రేప్ ఉదంతంలో కూడా మిస్డ్ కాల్స్ తోనే ఉద్యమం ఊపందుకుంది.

సూక్ష్మ సందేశాలు

చేతి రాత ద్వారా రాసే ఉత్తరాలు తూర్పుకి వెళ్ళి మాయమైపోయాయి! అంతా ఎస్ఎంఎస్‌ల మయం. ఒకప్పుడు మనసులో మాటలు అతి రహస్యాలు చెప్పుకునే మనుషులు వుండేవారు. ఇప్పుడు అటువంటి రహస్యం అంటే లేనేలేదు. సోషల్ నెట్‌వర్క్‌లు అనబడే సామాజిక కూడళ్ళు అందరికీ అందరినీ బహిర్గతం చేస్తున్నాయి. మొబైల్ ఫోన్లు కొత్త వారిని దగ్గర చేస్తున్నా, ఇంటివారిని దూరం చేస్తున్నాయని కుటుంబ బాంధవ్యాలు దెబ్బతింటున్నాయనీ, పిల్లల్లో చదువు పట్ల శ్రద్ధ సన్నగిల్లడానికి కారణమనీ కొంత ఆక్షేపణలూ మూటగట్టుకున్నాయి. ఒకరకంగా సెల్‌ఫోన్‌లు మనకి ఒక విధమైన ఏకాంతాన్ని కలిగించే స్వతంత్రాన్ని ఇచ్చాయి. కానీ అదే సమయంలో ఇతరులకు మన ఉనికిని తెలియ చెప్పే వెసులుబాటు కూడా ఇచ్చాయి. స్నేహితులతో ఎప్పుడైనా ముఖాముఖీ మాట్లాడే రోజులు పోయి ప్రతి రోజు వాట్సప్! అనే రోజులు వచ్చాయి. పలకరింపులు పొట్టివయ్యాయి. పరామర్శలు చిక్కిపోయాయి. కానీ చర్చలు, రచ్చలు, అభిప్రాయాలు, అరుచుకోడాలు, ప్రేమలు, మోసాలు, కాలక్షేప కబుర్లూ, రక్త దానం నుండి రాధేమా నాట్యం వరకూ, నమో ఉపన్యాసం నుండి నారా రాజధాని వరకు, ట్రాఫిక్ చిక్కుముడి నుండి బాహుబలి కలెక్షన్ల వరకు డేటింగ్‌లు మీటింగ్‌లు అన్నీ చాటింగ్‌లోనే. అన్నీ అరచేతిలోనే.

యాప్‌ల ప్రపంచం

ఇక ఫోన్ల కోసం రూపొందించిన యాప్‌లతో మరింత వెసులుబాటు జరుగుతుంది. ఆన్‌లైన్ల షాపింగ్ టాక్సీలు, టికెట్ బుకింగ్ బిల్లులు చెల్లింపులు, బ్యాంక్ లావాదేవీలు, రక్తపోటు, వ్యాయామంలో క్యాలరీల ఖర్చు తెలిపే వంటివి ఇప్పటికే బాగా ప్రాచుర్యం పొందాయి. కొన్ని యాప్‌లు మన ఆర్థిక లావాదేవీలను చూసుకునే వీలు కలిగిస్తే కొన్ని క్షణ క్షణం వార్తలను అందిస్తాయి. కొన్ని నిమిషాలలో టాక్సీ బుక్ చేస్తే ఇంకొన్ని ఇంట్లో నుండే షాపింగ్ చేసుకునే వీలు ఇస్తున్నాయి. కొన్ని దగ్గరలో నుంచి హోటల్‌ని సూచిస్తే ఇంకొన్ని కొత్త స్నేహితులని కలిపిస్తాయి. అసలు మనం ఏమి కావాలనుకుంటే అందుకు అనువైన యాప్ ఒకటి ఉండి ఉంటుంది. నిర్భయ యాప్ మహిళల కోసం నిర్దేశించబడిన యాప్. ఎవరైనా ప్రమాదంలో చిక్కుకుంటే దీని ద్వారా తమ ప్రదేశాన్ని ఇతరులకు తెలియచేసే వీలుంది. ఇది ఒంటరిగా ప్రయాణించే మహిళలకు ఎంతో ఉపయోగం. ఇటువంటి అనేకానేక సౌలభ్యాలకు నిలయం మొబైల్ యాప్ ప్రపంచం. చాలా యాప్‌లు ఉచితంగా లభించినా వాటిని రూపొందించిన వారికి ప్రకటనల ద్వారా ఆదాయం వస్తూనే వుంటుంది. కొన్ని యాప్‌ల ద్వారా వాటి యజమానులకి బిలియన్ల డాలర్ల ఆదాయం సమకూరుతుంది.

మీడియాలో మొబైల్

మొబైల్ ఫోన్ ద్వారా మీడియాకి రెండు విధాలుగా ఉపయోగం ఉంది. హెడ్ ఆఫీస్‌కి సమాచారం అందించడం ఒకటైతే అసలు మొబైలు ఫోన్‌లోనే మీడియాని ఉంచడం మరొకటి. ఇప్పుడు ప్రతి పేరున్న పత్రిక చానల్ మొబైల్ కోసం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసుకుంది. టీవీ ముందు కూర్చోవడం వార్తా పత్రికలు చదవడం క్రమంగా తగ్గుముఖం పడుతున్న తరుణంలో మొబైల్ ఫోన్ లోనే తమ పాఠకులని వీక్షకులుగా మార్చేసుకుంటోంది. మీడియా ఇక పుస్తకాలూ,

సమీక్షలు, కవితలు, కథలూ వగైరాలు ఫోన్ లోనే చదివే వీలుగా 'ఈ' ఫార్మాట్‌లో వచ్చాయి. అలాగే మీరు విలేకరులు కాకపోయినా వార్తలు సేకరించవచ్చు. ఎక్కడైనా ప్రమాదం జరిగినా విశేషం జరిగినా, ప్రజా సేవల పరిస్థితి ఘోరంగా కనబడినా మొబైల్ ఫోన్‌తో ఫోటో తీసేసి క్షణంలో అనేక మందికి పంపుతున్నారు. ఇటువంటివి వెబ్‌సైట్లలో పెట్టినప్పుడు సంబంధిత వ్యక్తులు, సంస్థలు, అధికారులు స్పందించే అవకాశం అధికం.

వ్యాపారంలో తోడు

ఫోన్‌లో వాణిజ్య ప్రకటనలు గుప్పించి వ్యాపారం వృద్ధి చేసుకోవడం ఇప్పుడు బాగా జరుగుతోంది. ఆన్‌లైన్ వ్యాపారం కేవలం మొబైల్ ఫోన్ల వల్లనే పెరిగింది.ఇంకా పెరుగుతోంది. మరింత పెరగవచ్చు. యాప్‌లు చాలా వరకూ ఉచితంగా ఉన్నా వాటిలో కలిసి వచ్చే ప్రకటనలు కొత్త వ్యాపారాన్ని తెచ్చి పెడుతున్నాయి. ఫోన్‌లతో ఇప్పుడు ఎక్కడ సామాజిక అత్యవసరం ఉన్నా క్షణాలలో ఆ సందేశం వేలాది మందికి అందుతోంది. ఫలానా వాళ్ళు తప్పి పోయారానో, ఫలానా గ్రూపు రక్తం అత్యవసరం అనో, ఫలానా దగ్గర దుర్ఘటన జరిగిందనో... ఇలా ఇతరుల నుండి సహాయం అర్థించడానికి ఫోన్లు ఇప్పుడు బాగా ఉపయోగపడుతున్నాయి.

రాబోయే రోజుల్లో మొబైల్ ఫోన్ల రూపంతో పాటు వాటి వాడకంలోనూ పెను మార్పులు రావచ్చు. ఇప్పటికే సైగలతో పనిచేసే ఫోన్లు వస్తున్నాయి. చేతికి వాచీలా చుట్టేసే ఫోన్లూ ఉన్నాయి. రానున్న రోజుల్లో మడుచుకోగలవి, ముడుచుకోగలవి వస్తాయి. మొత్తం డిస్ప్లేగా ఉండవచ్చు. అంటే ఏ వైపు నుండి చూసినా మెనూ కనిపిస్తుంది.

ఇక ఆలోచనలతో పనిచేసేవి కూడా రావచ్చు. భవిష్యత్తులో విద్య ఫోన్ల ద్వారా జరగవచ్చు. ఇప్పటికే మానవ జీవన విధానాన్ని గణనీయంగా మార్చి వేసిన మొబైల్ ఫోన్ ఇంకా ఎటువంటి మార్పులని సౌకర్యాలనీ సౌలభ్యాన్ని సమస్యలని తీసుకొస్తుందే వేచి చూద్దాం. ✦

కలలో సుల్తానా

మూల కథ: రొకియా హుస్సేన్
తెలుగు : దేవరాజు మహారాజు

ఓ రోజు సాయంత్రం నా పడక గదిలోని ఈజీ చైర్లో బద్ధకంగా కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాను. భారతీయ మహిళల స్థితిగతుల గూర్చి ఆలోచించడం నాకు అలవాటు కాబట్టి నా ఆలోచనలు అటు వైపు సాగాయి. నేను నిద్రలో ఉన్నానా మెలకువతో ఉన్నానా అని చెప్పడం కష్టం. కాని బాగా ఆలోచిస్తే మెలకువతో ఉన్నట్టే అనిపించింది. ఎందుకంటే నిర్మలమైన ఆకాశం, చుక్కలు, వెన్నెల అన్నీ నా కళ్ళ ముందే కనిపిస్తున్నాయి.

ఉన్న పళంగా ఓ స్త్రీ నా ఎదుట ప్రత్యక్షమయ్యింది. ఆమె అలా నా గదిలోకి ఎలా వచ్చిందో తెలియదు. కాని నేను ఆమెను దగ్గరి స్నేహితురాలిలాగా భావించాను.'సోదరి సారా!' అని పిలిచాను.

“శుభోదయం” అంది సారా. నాలో నేను నవ్వుకున్నాను. అది రాత్రి సమయమైతే శుభోదయమంటే ఇక నేనేం మాట్లాడనూ? అయినా “ఆ ఎలా ఉన్నావ్ సారా”! అని పలుకరించాను.

“నేను బాగానే ఉన్నాను కాని మీరొక సారి బయటికొస్తారా? మా తోట చూద్దురు గానీ” అని పిలిచింది.

కిటికీ గుండా బయటికి చూశాను. వెన్నెల వెలిగిపోతూ ఉంది. నిర్భయంగా, హాయిగా, ఆనందంగా వాహ్యాళికి వెళ్ళొచ్చునని అనిపించింది. బయట మగ నౌకర్లు గాఢ నిద్రలో ఉన్నారు. సోదరి సారాతో అలా నడుస్తూ వెళ్ళడంలో ఎంతో ఆనందం లభిస్తుందని నాకు తెలుసు డార్జిలింగ్ లో ఉన్నప్పుడు బొటానికల్ గార్డెన్స్‌లో ఇలాగే సరదాగా తిరిగేవాళ్ళం. మనసు విప్పి మాట్లాడుకునే వాళ్ళం. అందుకే పిలవగానే బయటికి రావడానికి సిద్ధపడ్డాను.

కానీ ఆశ్చర్యం. బయటికి రాగానే వాతావరణం ఉషోదయం వేళలా ఉంది. జనం గుంపులు గుంపులుగా పనుల మీద వెళుతున్నారు. రాత్రి పూట కదా అని బయటికొస్తే ఇక్కడ పట్టపగలు లాగా ఉంది. నాకు కొంచెం ఎబ్బెట్టుగా అనిపించింది. సిగ్గుపడుతూ నడుస్తున్నాను. చుట్టు పక్కల ఎక్కడ చూసినా మగ పురుగు లేదు. ఆశ్చర్యం లోంచి తేరుకునే లోపలే కొందరు ఆడవాళ్ళు నున్న చూసి హేళనగా ఏదో మాట్లాడారు. వాళ్ళ భాష ఏదో నాకు అర్థం కాలేదు. వాళ్ళు అంటున్నదేమిటో అని సోదరి సారానడిగాను. ఆమె

నవ్వి నీ దగ్గర పురుష లక్షణాలున్నాయని గేలి చేస్తున్నారని చెప్పింది.

'పురుష లక్షణాలా?' నాకేమీ అర్థం కాలేదు.

'అవును. సిగ్గు పడుతూ నడవడం పురుష లక్షణమే కదా?' అంది. సోదరి సారాయేనా నన్నిలా అంటున్నదీ అని ఆమె ముఖం పరిశీలనగా చూశాను. ఆశ్చర్యం ఆమె సోదరి సారా కాదు. మరెవరో కొత్త వ్యక్తి. నా చేయి పరిచయం లేనివాళ్ళ చేతిలో ఉండడం అదీగాక పట్టపగలు ఇలా బురఖా లేకుండా నిర్భయంగా నడవడం నాకు అలవాటు లేదు. నా చేయి వణకడం గమనించి ఆమె ఆదుర్దాగా ఆత్మీయంగా అడిగింది. ఏమిటీ అని నేను నా భయాన్ని బయట పెట్టాను. ఆమె పెద్దగా నవ్వి...

“అలాంటి భయాలేం వద్దు. ఇది నారీ మణుల దేశం. ఇక్కడ మగవారు ఉండరు. ఇక్కడ పాపాలుండవు. పగా ద్వేషాలుండవు. స్వేచ్ఛగా హాయిగా ఊపిరి పీల్చుకోవచ్చు” అని చెప్పింది. ఆమె చెప్పిన తర్వాత నేను గమనించాను. నిజంగానే అక్కడ ఒక్క అద్భుత ప్రపంచం ఉంది. మేం నడుస్తున్నంత దూరం మా కాళ్ళ కింద మెత్తని పూలు పరుచుకుని ఉన్నాయి.

“ప్రతి మొక్కని ఎంత జాగ్రత్తగా పెంచావు సారా” అని అన్నాను. ఆమె సారా కాదని తెలిసినా నేను ఎందుకో అలాగే పిలుస్తున్నాను. ఆమె నన్ను నా పేరు సుల్తానా అనే సంభోదిస్తోంది.

“మీ కలకత్తాని ఇంతకన్న అందమైన పూల తోటగా మార్చొచ్చు. కానీ మీ వాళ్ళు అందుకు కృషి చేయాలి”అంది ఆమె.

అవునూ ఊళ్ళోని మగవాళ్ళంతా ఏమయ్యారు? నాకు అది తెలుసుకోవాలని ఉబలాటంగా ఉంది. ఆ విషయమై ఆమెను అడిగాను.

'ఎక్కడ ఉంటారు? వాళ్ళ వాళ్ళ ఇళ్ళలో పరదాల చాటున ఉంటారు. అయినా ఇక్కడ పద్ధతులు నీకు తెలియవు కదూ? వెనకటి రోజుల్లో 'జనానా' పేరుతో స్త్రీలకు పరదాల చాటున బురఖాల చాటున దాచేసినట్టు ఇక్కడ మగవారిని 'మర్దానా'లో ఉంచుతారు.

ఎంత విచిత్రం నాకు నవ్వాగలేదు. నన్ను చూసి సోదరి సారా కూడా నవ్వింది.

'మీరు మీ భారత దేశంలో అధికారాలు హక్కులు అన్నీ మగవారికి ఇచ్చి, మీరు చేతులు నలుపుకుంటూ కూర్చుకున్నారు. వారు మిమ్మల్ని 'జనానా' కింద జమకట్టి ఇంట్లో తోసేశారు. వారిని మీరు పతి, దైవం అని పూజిస్తారు. వారు బలవంతులు గనుక వారికి ఆ హక్కులు వచ్చాయి' అన్నాను.

'హూ... బలం? సింహం బలమైందే. కాని అది వచ్చి మానవ సామ్రాజ్యాన్ని ఏలుతానంటే మనిషి ఒప్పుకుంటాడా? మనిషి తెలివైన వాడు. దాన్ని ఎలాగో కట్టిపడేసి తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంటాడు కదా? ఇదీ అంతే ? బలం ఒక్కటే కొలబద్ద కాకూడదు. కుటుంబ వ్యవస్థకు ఎంతో చేస్తూ మీరు బానిసల్లా పడి ఉన్నారు. మీ హక్కుల్ని కూడా మీరు మర్చిపోతే ఇక ఎవరేం చేయగలరూ?'

'సోదరీ సారా నాదొక అనుమానం. అన్ని పనులు మనమే చేస్తుంటే ఇక మగవాళ్ళేం చేస్తారూ?'

"వాళ్ళేమీ చేయనక్కరలేదు. కట్టకట్టి జనానా కింద ఇంట్లో పరదాల వెనక్కి తోసెయ్యడమే!'

"అలా అయితే వారితో పాటు వారి వ్యవహారాలన్నీ మూలపడి పోతాయి కదా? వ్యాపారం, రాజకీయం, పరిపాలన ... పురుష పుంగవులు తమను తాము వ్యవహారదక్షులుగా నిలబెట్టుకోవడానికి ఎన్నో రంగాల్ని ఏర్పాటు చేసుకున్నారు కదా?"

నా మాటకి సారా చిన్నగా నవ్వి ఊరుకుంది. నూతిలోని కప్పలాంటి నాతో వాదనలెందుకూ అని అనుకుందేమో తెలియదు.

మాటల్లోనే మేం సారా ఇంటికి చేరుకున్నాం ఆమె ఇల్లు హృదయం ఆకారంలో ఉన్న అందమైన తోట మధ్యలో ఉంది. లోపలికెళ్ళగానే భవనం చల్లగా ఆహ్లాదంగా ఉంది.

ఇంతలో సారా ఏదో కొత్త ఎంబ్రాయిడరీ డిజైన్ ప్రారంభించింది. ఎవరైనా సరే ఆమె నైపుణ్యానికి అబ్బురపడాల్సిందే! ఇంటి పని ఆఫీసు పని తీరికే ఉండదు. కదా! ఇక ఎంబ్రాయిడరీకి సమయం ఎక్కడ ఉంటుందో నాకైతే అర్థం కాలేదు. అదే విషయం ఆమెను అడిగాను.

"ఏముంది ఆఫీసు పని రెండు గంటల్లో పూర్తి చేస్తాను. మిగతా సమయం మరిన్ని మంచి పనులకు కేటాయిస్తాను" అంది సారా.

"రెండు గంటల్లో ఆఫీసు పనా? అదెలా సాధ్యం! మా దగ్గర మగవాళ్ళు ఆఫీసుల్లో ఆరేడు గంటలు కూరుకుపోతారు" అన్నాను అమాయకంగా

"అవును. మీ మగవాళ్ళకు అరగంటకోసారి పొగ తాగడం. గంట



కోసారి టీ తాగడం అలవాటు. వాళ్ళు చేసేది రోజంతా గంట పనే. ఉబుసుపోక ఊకదంపుడు ఉపన్యాసాల్లాంటివి మా రాజ్యంలో ఉండవు. నిర్ణయించిన ప్రకారం పని అయిపోతే ఇక ఏ పనైనా చేసుకోవచ్చు. అది సమాజానికి ఏదో ఒక రకంగా ఉపయోగపడితే చాలు."

"అన్ని ఆఫీసుల్లో అన్ని పనులు చేయడానికి స్త్రీలు ఉన్నారా? అసలు చదువుకున్న స్త్రీల సంఖ్య తక్కువ కదా?"

"అది మీ రాజ్యంలో. ఇక్కడ అలా కాదు. కేవలం మహిళల కోసమే ప్రత్యేకంగా విశ్వవిద్యాలయాలు ఏర్పరిచారు. అందులో పురుషుల్ని అనుమతించం. ఇక్కడ మా మహారాణికి సాంకేతిక వైజ్ఞానిక అధ్యయనమంటే వల్లమాలిన ప్రేమ! రాగల కాలంలో వాటి ప్రాధన్యత ను ముందే గుర్తించి మహిళలందరూ ఆయా రంగాల్లో శిక్షణ పొందాలన్న నియమం పెట్టారు...." అలా సోదరి సారా ఎన్నో విషయాలు చెబుతూ పోయింది. నేను ఎవేవో ప్రశ్నలు వేస్తూనే ఉన్నాను.

అలా... అలా...

నేను వాస్తవ ప్రపంచంలోకి ఎప్పుడు ఎలా వచ్చానో నాకు తెలియనే తెలియదు.

✦

రచయిత్రి గురించి

బంగ్లాదేశపు ముస్లిం రచయిత్రి రొకియా హుస్సేన్ (1879–1932)కు

అభిమాన పాఠకులు భారత్‌లోనే ఎక్కువగా వుండేవారు. సంప్రదాయసిద్ధమైన కుటుంబంలో పుట్టినందుకు ఎన్నో అవరోధాల్ని ఎదుర్కొన్నారు. సోదరుడి సహాయంతో దొంగ చాటుగా రాత్రివేళల్లో చదువుకున్నారు. భర్త ప్రోత్సాహంతో బాలికలకు పాఠశాలలను, ముస్లిం మహిళలకు ఒక సంస్థను ఏర్పాడు చేశారు. బురఖాలనే కాదు. ఒంటి నిండా బంగారు గొలుసులు వేసుకోవడాన్ని కూడా మె దుయ్యబట్టారు. ఖైదీలు ఇనుప గొలుసులతో కట్టి వేయబడ్డట్టు స్త్రీలంతా బంగారు గొలుసులతో కట్టివేయబడ్డారన్నది ఆమె అభిప్రాయం. ఈమె రచనలు స్త్రీవాద రచయిత్రి వొల్ స్టోన్ క్రాఫ్ రచనలతో సరితూగుతాయని సాహితీ విశ్లేషకులు శ్లాఘించారు.

ఆత్మహత్యకు అంతిమ గీతం

- అడిగోపుల వెంకటరత్నమ్
సెల్ 9848252946

ఎన్ని నిరాశలు ఆశల్ని జయించలేదు
ఎన్ని ఆశలు హతాసుల్ని వరించలేదు
వరుస గట్టిన ఆత్మహత్యలు
క్షణికోద్రోకానికి పరాకాష్టలు
షణ్ముఖ ప్రియ హరిప్రియ రాగాలు
శ్రోతల గుండెల్లో ప్రతిధ్వనిస్తున్నాయి
ఆహుతుల అంచనాకు
గెలుపు ఓటములు అందటం లేదు
న్యాయ నిర్ణేతల నిర్ణయం
హరిప్రియకు అందలం
అవమానంతో షణ్ముఖ ప్రియగాత్రం
ఆత్మహత్యకు పాల్పడలేదు
మర్నాడు మరో కచేరిలో
ప్రథమ స్థానమై వెలిగింది!
ఇరువురు పోటీ పడి నటిస్తే
ఓడిన నటన ఆత్మహత్యను వరించలేదు
పరాజితుడి నటన పరిపూర్ణమై
గెలుపుకు ఓటమిని అప్పజెప్పింది!
సరస్వతీ పుత్రుడై విద్యార్థి అందలమెక్కితే
ఓటరి విద్యార్థి
ఆత్మహత్యకు పరుగెత్తలేదు
పట్టుదల పరాజితుడి పూల పల్లకీయై
చదువులమ్మ సన్నిధి వూరేగింపు!
ప్రేమ ముప్పేట ముడిపడి
నాలో సగం నీలో సగమంటూ
తిరుగాడిన రెండు హృదయాలు
దూరమైన మగ ప్రేమను చూసి
ఆడప్రేమ ఆత్మహత్యగా మారక
మలిన మనసును గడకటమే జీవితం
ఒకోసారి బతుకు కన్నీటి సంద్రమౌతుంది
కన్నీటిని మోసిన నది కారణం అడగదు
నిండిన సముద్రం నీలెక్కడిదని అడగదు
దేని ప్రపంచం దానిది
దేని స్వార్థం దానిది
ప్రపంచాన్ని ప్రశ్నించటమంటే
ఆత్మహత్యకు చరమ గీతమే
కొత్తింటి కోడల్లా బెరుగ్గా అడుగిడిన
విద్యార్థినీ విద్యార్థులు
రాక్షస ర్యాగింగ్‌కు భీతిల్లి
ఆత్మహత్యను స్వాగతించక
సీనియర్లను సంస్కరించటమే
జూనియర్ల ప్రప్రథమ ప్రణాళిక!
తుపాను గాలికి చెట్టు పడి పోదు
ఊగివూగి వంగి వంగి
ప్రాణం వుగ్గబట్టి
ఆత్మరక్షణలో పడి
ఆఖరుకు నిటారుగా నిలుస్తుంది
ఆత్మహత్య సిగ్గుపడుతుంది!

టమోటాతో ...

కావాల్సిన పదార్థాలు

గుడ్లు: రెండు, టమోటాలు: రెండు, ఉల్లిపాయలు: ఒకటి, పచ్చిమిరపకాయలు: నాలుగు, కొత్తిమీర: ఒక కట్ట, పసుపు: చిటికెడు, ఉప్పు: తగినంత, నూనె: సరిపడా

తయారీ

టమోటాలను సన్నగా చక్రాల్లా కోసి పెట్టుకోవాలి. చక్రాల మధ్యలోని గింజల్ని తీసేయాలి. ఒక గిన్నెలో గుడ్డు సొన వేసుకోవాలి. అందులో సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమి ఎరపకాయ ముక్కలు, పసుపు, ఉప్పు వేసి బాగా కలపాలి. స్టౌ మీద పెనం పెట్టి సరిపడా నూనె పోసి బాగా కాగాక ఆమ్లెట్ వేసుకోవాలి. పైన టమోట ముక్కల్ని వరసగా పెట్టి కొద్దిగా లోపలికి నొక్కాలి. వీటిపై కొత్తిమీర తురుము కూడా వేయాలి. టమోటా ముక్కలు ఆమ్లెట్‌కి అతుక్కునేవరకూ సన్నని మంటపై వేగనివ్వాలి. రెండవ వైపు కూడా కొద్దిగా వేగనిచ్చి దించేయాలి.

ఆహా...ఆమ్లెట్

పాలకూరతో...

కావాల్సిన పదార్థాలు

గుడ్లు: 2
ఉల్లిపాయ: చిన్నది ఒకటి
పాలకూర తరుగు: 4 టీ స్పూన్లు
పచ్చిమిర్చి: 2
అల్లం వెల్లుల్లి ముద్ద: చిటికెడు
గరం మసాలా: చిటికెడు
పెప్పర్ పౌడర్ : చిటికెడు
ఉప్పు: తగినంత
నూనె: 1 టీ స్పూన్

తయారీ

పాలకూర కడిగి ఆరబెట్టి సన్నగా తరగాలి. ఉల్లిపాయ కూడా చాలా సన్నగా తరగాలి. పాన్‌లో చెంచాడు నూనె వేడి చేసి ఉల్లిపాయ, పాలకూర, పచ్చి మిర్చి తరుగు వేసి బాగా వేయించాలి. ఇందులో చిటికెడు అల్లం వెల్లుల్లి ముద్ద వేసి మరికొద్దిగా వేపి దింపేయాలి. ఒక గిన్నెలో ఉప్పు, మిరియాల పొడి, గరం మసాలా పొడి, చెంచాడు నీళ్ల వేసి కలిపి వేయించిన ఉల్లి, పాలకూర మిశ్రమం వేసి కలపాలి. ఇందులో గుడ్లు వేసి బాగా నురగ వచ్చేలా గిలక్కొట్టాలి. ఇందాకటి పాన్‌లో మిగతా నూనె వేసి వేడయ్యాక గుడ్డు మిశ్రమంతో కొద్దిగా మందంగా ఆమ్లెట్ వేసి రెండు వైపులా కాల్చుకోవాలి.

క్యారెట్... మొక్కజొన్నలతో

కావల్సిన పదార్థాలు

క్యారెట్లు: రెండు, స్వీట్ కార్న్: 50 గ్రాములు, ఉల్లిపాయలు: ఒకటి, పచ్చి మిరపకాయలు: ఐదు, పసుపు: చిటికెడు, కొత్తిమీర: ఒక కట్ట, ఉప్పు: తగినంత, నూనె: సరిపడా

తయారీ : ముందుగా స్వీట్ కార్న్‌ని కుక్కర్లో ఉడికించి పెట్టుకోవాలి. ఒక క్యారెట్‌ని సన్నగా తురుముకోవాలి. స్టౌ మీద గిన్నె పెట్టి కొద్దిగా నూనె పోసి ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిరపకాయ ముక్కలు వేసి వేగించాలి. ఉప్పు, పసుపు, కొత్తిమీర, క్యారెటు తురుము కూడా వేసి బాగా ఎర్రగా వేగించాలి. చివర్లో ఉడికించి పెట్టుకున్న స్వీట్ కార్న్ కూడా వేసి బాగా కలిపి దించేయాలి. ఒక గిన్నెలో గుడ్డు సొన వేసి స్పూన్‌తో గిలకొట్టాలి. స్టౌ మీద పెనం పెట్టి సరిపడా నూనె పోసి ఆమ్లెట్ వేసుకోవాలి. ఆమ్లెట్ పైన వేయించి పెట్టుకున్న ఉల్లి, క్యారెట్, స్వీట్ కార్న్ మిశ్రమాన్ని వేయాలి. సన్నని మంటపై వేయించి దించేయాలి.

కూరగాయలతో...

కావాల్సిన పదార్థాలు

గుడ్లు: నాలుగు, బీట్ రూట్: ఒకటి, క్యాప్సికమ్: ఒకటి, క్యాబేజి తురుము:రెండు టేబుల్ స్పూన్లు, ఉల్లిపాయ ఒకటి, టమోటాలు రెండు, బీన్స్ నాలుగు, పచ్చిమిరపకాయలు: ఆరు, కొత్తిమీర కట్ట: ఒకటి, ఉప్పు: తగినంత, పసుపు: చిటికెడు, నూనె: సరిపడా

తయారీ

ముందుగా కూరగాయ ముక్కల్ని కుక్కర్లో ఒక విజిల్ వచ్చే వరకూ ఉడికించుకోవాలి. స్టౌమీద గిన్నె పెట్టి కొద్దిగా నూనె పోసి బాగా కాగాక పచ్చి మిరపకాయ ముక్కలు ఉల్లిపాయ ముక్కలు వేసి వేగించాలి. కొద్దిగా పసుపు, ఉప్పు, ఉడికించి పెట్టుకున్న కూరగాయ ముక్కలు కూడా వేసి బాగా కలిపి వెంటనే దించేయాలి. గుడ్డు సొనని ఒకసారి మిక్సీలో వేసుకుని ఆమ్లెట్ వేయాలి. ఆమ్లెట్ పైన కూరముక్కల్ని చల్లి చివర్లో కొత్తిమీర తురుము వేసి ఒక వైపుకి మడిచి సర్వ్ చేసుకోవాలి.

జవాబులు
పక్క పేజీలో

రంగుల సింహం

ఇదిగో ఇక్కడో సింహం వుంది కదా. దానికి మేం చెప్పిన రంగులద్దండే.
1. ఎరుపు 2. పసుపు 3. నీలం 4. ఆకుపచ్చ 5. నారింజ 6. వంగ 7. ఇటుక రంగు





మూడు త్రిభుజాలు

12 అగ్గిపుల్లలతో 6 త్రిభుజాలు తయారుచేశారు. అయితే 4 అగ్గిపుల్లలను కదిలించి మూడు త్రిభుజాలను తయారుచేయండి చూద్దాం.

ఆవలి ఒడ్డుకు చేరేదెలా?

ఓ పెద్దమనిషి సంతకెళ్లాడు. అక్కడ ఓ మేకను, నక్కను, క్యాబేజీని కొన్నాడు. తన ఊరికి చేరాలంటే నది దాటాలి. అతని దగ్గరేమో చాలా చిన్న పడవ వుంది. అందులో అతను కాకుండా ఒక్క ప్రాణిని మాత్రమే తీసుకెళ్లగలడు. అంతకంటే అదనంగా బరువు వేస్తే పడవ మునిగిపోతుంది. ఇప్పుడు ఈ మూడింటిని ఆవలి ఒడ్డుకు చేర్చి ఇంటికి తీసుకెళ్లేదెలా? జవాబు చెప్పండి చూద్దాం.

జవాబు: ముందుగా మేకను అవతలి ఒడ్డుకు తీసుకెళ్తాడు. తర్వాత మళ్లీ ఇవతలి ఒడ్డుకు వచ్చి నక్కను తీసుకెళ్తాడు. నక్క మేకను తినేస్తుంది కాబట్టి... అటు వెళ్లేప్పుడు మేకను వెంట తీసుకెళ్తాడు. మేకను ఇవతల వదిలాక క్యాబేజీని ఆవలి ఒడ్డుకు చేరుస్తాడు. తర్వాత ఇవతలి ఒడ్డుకు వచ్చి మేకను పడవలో ఎక్కించుకుని అవతలి ఒడ్డుకు వస్తాడు. మూడింటిని తీసుకొని ఇంటికి వెళ్తాడు. మొత్తం మీద అతను పడవలో అటూ ఇటూ ఏడుసార్లు తిరిగాడు.

నా బొమ్మ

సత్యజిత్
5వ తరగతి
వికాస విద్యావనం
పోరంకి



బంగారమా? దూదా?

ఒక షావుకారు దగ్గర ఒక కేజీ బంగారం, ఒక కిలో దూది వున్నాయి. ఇంతకీ ఈ రెండిట్లో ఏది బరువైనది? కేజీ బంగారమా? కిలో దూదా?

చూసి గీద్దాం



జత చేద్దాం

నలుగురు చిన్నారులు స్కూల్లో నాటకం వేశారు. అందులో నలుగురు ఇదిగో ఇలా సిండ్రిల్లాల్లా తయారయ్యారు. ఇంతకీ ఎవరి నెంబరు ఎంతో గుర్తించండి.



ఎంత సమయం?

ఇక్కడ 12 అడుగుల పొడవాటి దుంగ వుంది. దీన్ని రంపంతో పన్నెండు ముక్కలు చేయాలి. ఒక్కో ముక్కను నిముషంలో కోసేయొచ్చు. మరి 12 ముక్కలను కోయడానికి ఎన్ని నిముషాలు పడతాయి?



జవాబులు

బంగారమా? దూదా?: రెండూ సమానమే.

మూడు త్రిభుజాలు



ఎంత సమయం? : పదకొండు నిముషాలు. ఎందుకంటే చివరి ముక్కను కోయనక్కర్లేదుగా.

సురవరం ప్రతాపరెడ్డి రచనలు

తెలంగాణ అస్థిత్వవాద సౌరభాలను సాహిత్యంతో సహా అన్ని రంగాల ద్వారా గుబాళింపచేసిన వ్యక్తి సురవరం ప్రతాప రెడ్డిగారు. గోలకొండ కవుల సంచిక ప్రచురించి సాహితీ లోకానికి సత్తా చాటిన వారు ప్రతాప రెడ్డి.

తెలంగాణములో సురవరం వారు కథానికా రచనకు పూనుకున్న వారిలో ఆద్యులు. "గోల కొండ" పత్రికాధిపతిగా కూడా ప్రసిద్ధులు అప్పటి సమాజాన్ని దృష్టిలో ఉంచుకొని అనేక కథలు రచించారు. తెలంగాణలో సాహిత్య ప్రచారం చేయడానికి ఉద్భవించిన అణాగ్రంథమాలకు సురవరం వారు మొగలాయాల కథలు రెండు సంపుటాలు రచించారు. ఈ సంపుటిలోని కథలన్నీ ప్రేమ, ప్రణయం, విరహం, కులాంతర-మతాంతర వివాహాలు, దొంగస్వాముల లీలలు, నవాబుకే కరోడ్గివి వేసే విధానం చెప్పిన గోమాజీ గణేష్, నైజాం రాష్ట్రంలోని ప్రజల గాథలు, ఈ కథా సంపుటిలో ప్రతాప రెడ్డి చక్కగా ఎరుకపరిచారు. ఇల్లిందల సరస్వతీ దేవి "చిన్న కథ" అంటూ చక్కటి ముందు మాట రాశారు. ఈ కథల సంపుటిలో "నిరీక్షణ" కథ చాలా గొప్ప కథ. బెస్త కులస్తుల యువప్రేమ జంటకథ. సముద్రంలో తెప్పమీద నిలబడి ఏడు చేపలు తీసుకురావాలి. అనే వర పరీక్షకు శంకరన్ నిలబడి సముద్రంలోకి వెళ్ళి ఎప్పటికీ తిరిగిరా(లే)డు. అతడి కోసం కుమారి నిరీక్షిస్తూ చనిపోతుంది. ఈ కథకు చారిత్రకాధారాలు ఉన్నాయంటారు. 21 కథల్లో ఇది ముఖ్యమైనది. చివరలో గోరా, సావిత్రీబాయి, లూనాజీ మాలుసులే, బలభద్రుడు సోమనాద్రి సదాశివరెడ్డి, గురుగోవింద్ సింగ్, భల్లూసింగ్, అబ్దుల్ రజ్జాఖ్, దేశపాండ్యా, బాలచంద్రుడు , అనవేమ భూపాలుడు లాంటి వీరుల వ్యాసాలు ఈ పుస్తకానికి నిండుతనం చేకూర్చాయి.

మొగలాయి కథల్లో రంభ, ఫకీరు బిడ్డ, రుమాలను బర్రె తిని పోయింది. బంగారు గాడిద, గ్యారా కద్దూ బారా కోత్వాల్, బీబీ జాన్ కథల్లో ఆనాటి సంఘరీతిని, నీతిని, వాతావరణాన్ని చక్కగా అక్షరీకరించారు. ఓ చక్కటి విలక్షణ కథా సంపుటి ఇది.



సురవరం ప్రతాపరెడ్డి రచనలు
రచన: సురవరం ప్రతాప రెడ్డి
పేజీలు: 198
వెల: రూ. 150/-
ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్
గిరి ప్రసాద్ భవన్-బండ్లగూడ
హైదరాబాద్-068,
ఫోన్ 24224458

ప్రసన్న కుమారి

చదివించే 'మన కథలు'

ఇటీవల కాలంలో రచయిత్రుల సంఖ్య పెరగటం సంతోషించాల్సిన విషయం. అందునా కథా రచనలో వారి సంఖ్య వాసిలో, రాసిలో పెరగటం మనం గమనించవచ్చు. అందులో ఒకరు డి.ఆర్.ఎల్.రాజేశ్వరి చంద్రజ. "మన కథలు" పేరుతో సంకలనంగా ఆమె వెలువరించిన కథలు బాగున్నాయి. మంచి కథలందించిన చంద్రజ గారు అభినందనీయులు. ఈ కథా సంకలనంలో మొత్తం 12 కథలున్నాయి. మధ్యతరగతి బుద్ధిజీవుల దృష్టి నుంచి ప్రస్తుతం మన సమాజంలో జరుగుతున్న మార్పులను పరిశీలించిన కథలివి. దిగజారుతున్న మానవ విలువలు, తరిగిపోతున్న కుటుంబ సంబంధాలు, పెచ్చుమీరుతున్న పేదరికంపట్ల జాలి... ఈ కథల్లో కనిపిస్తాయి. వ్యాపార విలువలు రాజ్యమేలుతున్న సమాజంలో అన్ని బంధాలు వ్యాపారమయమవుతాయి. తల్లితండ్రులను ముసలితనంలో చూడటం కూడా కష్టంగా ఎలామారిపోతున్నదో "నాన్నా చిరునామా" కథ మన కళ్ళకు కడుతుంది. అధైర్యపడకుండా వృద్ధాప్యంలో ఏదో ఒక వ్యాపకాన్ని ఎంచుకోవల్సిన అవసరాన్ని ఈ కథ తెలుపుతుంది. 'అమ్మా నేనొచ్చేసినానే', "బూరెల సంచి" యధార్ధ జీవన గాథలు పేదరికం లోనూ ప్రేమాభిమానాలను పంచే వ్యధలు. "ఇది కథ కాదు" అన్నా చెల్లెళ్ళ అనుబంధాలను తెలిపితే, "శ్యామల" అత్తాకోడళ్ళ అన్యోన్యతా అవసరాన్ని చెబుతుంది. "ఋణాను బంధ రూపేణా" మానవజీవితంలోని బాంధవ్యాల అవసరాన్ని తెలియ జెపుతుంది. "నలుగుతున్న బాల్యం", "కార్పోరేట్ పసిమొగ్గలు" మారు తున్న విద్యావ్యవస్థ బాల్యాన్ని చిదిమేస్తున్న తీరును, కొత్త పోకడలను వివరిస్తుంది."మిర్చిచెట్టు సెంటర్" రోజూ పనులు చేసుకునే మహిళా కార్మికుల జీవితాలలో లైంగిక వేధింపులపై నిరసన గళం వినిపిస్తుంది. చంద్రజకు భాష మీద మంచి పట్టు వుంది. పాత్రల భాష ఒడిసి పట్టేశారు. అలాగే కథనంలోనూ ఆమెకు మంచి పట్టు ఉంది. తప్పక చదవాల్సిన కథలు. రచయిత్రి స్వయంగా ప్రచురించుకున్న ఈ కథా సంపుటాన్ని 'నవ చేతనా పబ్లిషింగ్ హౌస్' పంపిణీ చేస్తోంది. **- భవిష్య**

తెలంగాణ మాండలికాన్ని ఒడిసి పట్టిన కథలు

'ఈ కథలు నా వాళ్ళు నాకిచ్చిన అనుభవాలు నమస్తే తెలంగాణ పత్రిక కరీంనగర్ జిల్లా సంచికలో సాహిత్య పేజీ కోసం రాసినవి అంటారు రచయిత. 1985-1995 మధ్య కాలం నాటి సంగతులే ఈ కథలు.

సామాన్యుల భాషనే సాహిత్య భాషగా కథీకరించారు రచయిత. తొలి కథ పేరు "ఊర విశ్క"(ఊర పిచ్చుక), పక్షుల్ని ప్రేమించాలి అనే సందేశాన్ని ఇస్తుంది. "అల్లు" కథలో తాత మాటలు..అక్షర సత్యాలుగా నిలుస్తాయి.(పేజీ 10) "గీళ్లెవలూ మా అవ్వయ్య కాలంల లేరు. అంత నడుమంత్రానచ్చి దేవుళ్ల యిర్రు గీళ్ళకు పెద్ద పెద్ద గుళ్ళు గట్టి... ఇగ్రాలు పెట్టిర్రు. హుండీలు పెట్టిర్రు. పైసలిచ్చి టికెటు గొంటె పూజ జ్జేత్తరు. లేకుంటే లేదు. గా దేవుళ్ళనేమో మన కోసం మనం బెట్టుకుంటె, గీ దేవుళ్ళ నేమో మనల్ని దోసుకునెతందుకు పెట్టిర్రు" అన్నాడు తాత... గ్రామ దేవతల ప్రాధాన్యత ..సామాన్యుల విశ్వాసాలపై సాగిన "అల్లు" కథ బాగుంది. చేపల కూర కథాంశంగా " బుడ్డ వర్కలు" సాగింది.

శెరువు, లగ్గం, బగ్గు కథ, ఎవుసం, నర్సిమ్మ సామి జాతర, జాజిరి, శిన్న బతుకమ్మ, తెల్ల బొట్టు కుక్క, శెట్ల తీర్ధం, బాల్తాత , ఎర్ర కోడిపెట్ట, సలిమంట, ఈత కల్లు, బసవన్న గుట్ట, పయ్యొద్దు, మామిడి శెట్టు,జెకముక సంచి,అయి ట్రేట్ మూడు బజార్లు కథలు చివరి పేజీ దాకా చదివిస్తాయి. జెకముకరాయి ఇనుపశీలతో నిప్పు చేయడం. మక్క కంకులు పొలం నుండి కోసి కాల్చుకోవడం... తాత వద్ద జెకముకసంచి పొలంలో తాత మనవళ్ళు అనుభూతులు తెలిపే కథ" జెకముక సంచి". అన్ని కథలు రెండు పేజీల్లోపే ఉంటాయి. చక్కటి తెలంగాణ పల్లె భాష అందులోని మాధుర్యాన్ని అనుభవిస్తూ హాయిగా అన్ని కథలు పాఠకుల్ని అలరిస్తాయి. జ్ఞాపకాల తడి తీపి గుర్తుల్ని, బాల్యాన్ని గుర్తుకు తెస్తాయి.

తంగిరాల చక్రవర్తి



జెకముక సంచి
రచన: చిల్ల మల్లేశం
పేజీలు: 62
వెల: రూ. 40/-
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
గిరి ప్రసాద్ భవన్-బండ్లగూడ
హైదరాబాద్-68.
ఫోన్:24224459

అలనాటి పల్లె...

వింటేజీ వస్తువులుంటాయి. విక్టోరియన్ ఎరా వైభవాలు మిగిలుంటాయి. కానీ వింటేజీ విలేజ్‌లు ఇంకా పశ్చిమాన ఉన్నాయని తెలుసా. 17, 18 శతాబ్దాలనాటి అనుభూతుల్ని ఇప్పటికి మీకుగుర్తుచేస్తాయని తెలుసా. నెదర్‌ల్యాండ్స్‌లోని జాన్సె స్చాన్స్ అనే గ్రామం పాతకాలపు డచ్ సంస్కృతిని ఇంకా బతికిస్తూనే ఉంది. జాన్ నది తూర్పు ఒడ్డున విస్తరించిన ఈ గ్రామం చాలా విశాలమైంది. అందమైన పొలాలు, ఇప్పటికీ పనిచేసే గాలి మరలు, పాతకాలపు రంగురంగుల చెక్క ఇళ్లు, వింటేజీ సైకిళ్లు సంప్రదాయ గ్రామీణ వేషధారణతో ప్రశాంతంగా ఉండే ఆ గ్రామంలో అడుగుపెడితే రెండు మూడొందల ఏళ్లు టైమ్ మెషీన్‌లో టెలిపోర్ట్ అయిపోతాం. ఈ అపురూపమైన గ్రామాన్ని చాలా అబ్బురంగా చూసుకుంటారు స్థానికులు. ఈ పల్లె అందానికి పట్టం కడుతూ అక్కడ ఓ మ్యూజియం కూడా 1994లో కొలువుదీరింది. ఉత్తర హాలెండ్ ప్రావిన్స్ కిందకు వచ్చే ఈ ప్రాంతం ఆమ్‌స్టర్‌డ్యామ్ దగ్గరలోనే ఉంటుంది. 1961 నాటి నుంచి డచ్ ఆర్కిటెక్చర్ అద్భుతాలైన చెక్క ఇళ్లను, గాలి మరలను, బార్న్ (ధాన్యపు కొట్టాం)లను అతి జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నారు. 1574 నుంచే ఉన్న ఈ గ్రామ ప్రత్యేకతను పదిలం చేస్తూ వచ్చారు. ఏటా పది లక్షల మంది పర్యటించే ఈ గ్రామంలో పర్యాటకుల హడావిడే కనిపించనంత విశాలంగా ఉంటుంది. జాన్సె నదిని హత్తుకుని అల్లుకున్న ప్రకృతితో పోటీ పడుతుంది ఆ గ్రామం అందం. అక్కడి చాలా పర్యాటక ప్రదేశాలకు ప్రవేశం ఉచితం. కొన్నింటికి మాత్రం రుసుము చెల్లించాలి అది కూడా నామమాత్రమే. ఎందుకంటే ఆ పల్లె అందాన్ని వెలకట్టలేరు. ఎప్పుడైనా మనసు అలనాటి గ్రామ సీమల ఊహల్లోకి ఎగిరిపోతే ఇక్కడ వాలిపోయి దాన్ని బుజ్జగించవచ్చు. ●

నీ కళ్లతోటి...

'నీ కళ్లతోటి నా కళ్లలోకి చూస్తేనే చంద్రోదయం..' పాట పండినట్టుగా ఉంటుంది టాల్‌పాలెజ్ కళ్లను చూస్తే. కళ్లతోటి కోటి భావాలు పలికించే వాళ్లు న్నారో లేదో టాల్ పాలెజ్ మాత్రం కనురెప్పలపైనే గాఢమైన భావాల్ని ఒలికిస్తోంది. ఇజ్రాయెల్‌కు చెందిన టాల్ పాలెజ్ ఓ విజువల్ ఆర్టిస్ట్. ఫొటోగ్రఫీ అంటే ఆమెకు ప్రాణం. అలాగే మేకప్ ఆర్టిస్ట్ కూడా. ఈ రెంటినీ మిళితం చేసి ఆమె బ్లాగ్‌ను నడుపుతోంది. ఓ ఫేస్‌బుక్ పేజ్ కూడా ఉంది. తన అద్భుతమైన ఫొటోగ్రఫీలో టాల్ తన కళ్ల అందాన్ని మరింత చమత్కారంగా క్లిక్‌మనిపిస్తుంది. కంటి రెప్పలపై పూలను విరబూయిస్తూ, నెమళ్లను మోస్తూ, కోట కిటికీలు తెరిపిస్తూ ఇలా ఎన్నో తలపులకు తలుపులు తీస్తోంది. వాటిని కెమెరా కంటితో బంధిస్తోంది. ఆ కళ్లను చూసిన ఫాలోవర్లు లక్షలాది లైక్‌లతో దిష్టి తీసేస్తున్నారు.

టాల్ పాలెజ్